## బాలల బొమ్మల

# భట్టి - విక్రమార్క



# భట్టి-విక్రమార్క కథలు



## సరస్వతి పబ్లికేషన్

కాజా వెంకటేశ్వరరావు వీధి, అరండల్ పేట,
సహారా బ్యాంక్ ఎదుట, విజయవాడ -2.

భట్టి - విక్రమార్క కథలు

పేజ్ మేకింగ్:
సరస్వతి గ్రాఫిక్స్
విజయవాడ

కాపీరైట్ పబ్లిషర్స్

ప్రథమ ముద్రణ:
ఏప్రిల్ 2009

ముద్రణ:
రమణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
విజయవాడ

ముఖచిత్రం:
రమణ

పబ్లిషర్స్:
**సరస్వతి పబ్లికేషన్**
కాజా వెంకటేశ్వరరావు వీధి,
అరండల్ పేట, సహారా బ్యాంక్ ఎదుట,
విజయవాడ - 2

BHATTI-VIKRAMARKA
KATHALU

Price : 50/-

D.T.P. by
SARASWATHI Graphics
VIJAYAWADA

Copy Right Publishers

First Edition:
April 2009

Printed at:
Ramana Offset Printers
VIJAYAWADA

Cover page:
Ramana

Publishers:
SARASWATHI PUBLICATION
Kaza Venkateswara Rao Street,
Arundelpet, Opp. Sahara Bank,
VIJAYAWADA - 2

ఈ పుస్తకం కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. అయినా పొరపాట్లు దొర్లి ఉండవచ్చును. మాకు తెలిపిన మలిముద్రణలో సవరించగలము

## విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ప్రారంభం | ........ | 7 |
| 2. | భట్టి–విక్రమార్క చరిత్ర | ........ | 13 |
| 3. | ఇంద్రుడి వరం | ........ | 19 |
| 4. | భట్టి కాళికా వరం పొందుట | ........ | 20 |
| 5. | సాధువు తన రాక గురించి చెప్పుట | ........ | 23 |
| 6. | బేతాళుడి పూర్వ గాథ | ........ | 25 |
| 7. | బేతాళుడు చెప్పిన కథలు | ........ | 31 |
| 8. | ఎవరికి ఎవరు ఏ వరస...? | ........ | 37 |
| 9. | పద్మావతి కథ | ........ | 46 |
| 10. | విక్రమార్కుడు చిలుక రూపం పొందుట | ........ | 53 |
| 11. | విక్రమార్కుడు చిలుకల గుంపులో చేరుట | ........ | 56 |
| 12. | విక్రమార్కుడికి తిరిగి స్వేచ్ఛ లభించటం | ........ | 62 |
| 13. | విక్రమార్కుడు తిరిగి తన శరీరంలో ప్రవేశించుట | ........ | 65 |
| 14. | శాలివాహనుడు విక్రమార్కుడిని జయించుట | ........ | 67 |



# సరస్వతి వారి నూతన ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | వాల్మీకి రామాయణము | - 100-00 |
| 2. | అన్నమాచార్య సంకీర్తనలు | - 40-00 |

## చిల్డ్రన్ సిరీస్

| | | |
|---|---|---|
| 1. | పంచతంత్రం | - 50-00 |
| 2. | తెనాలి రామకృష్ణ కథలు | - 50-00 |
| 3. | అక్బర్, బీర్బల్ కథలు | - 50-00 |
| 4. | పిల్లల నీతి కథలు | - 50-00 |
| 5. | ఆలీబాబా నలభై దొంగలు | - 50-00 |
| 6. | బేతాళ కథలు | - 50-00 |
| 7. | అల్లా ఉద్దీన్ అద్భుత దీపం | - 50-00 |
| 8. | పరమానందయ్య శిష్యుల కథ | - 50-00 |
| 9. | తాతయ్య చెప్పిన కథలు | - 50-00 |
| 10. | భట్టి విక్రమార్క కథలు | - 50-00 |
| 11. | చందమామ కథలు | - 50-00 |
| 12. | బామ్మ చెప్పిన కథలు | - 50-00 |
| 13. | అరేబియన్ నైట్స్ | - 50-00 |

శాలివాహనుడు యుద్ధభేరి మ్రోగించాడు.

దండయాత్రలు సాగించాడు.

ఉజ్జయినీ నగరం వైపు ప్రయాణిస్తూ దారిలో ఉన్న రాజ్యాలను జయించుకుంటూ చివరకు విక్రమార్కుడితో తలపడ్డాడు.

శాలివాహనుడికి ముహూర్తబలం తోడయ్యింది...

విక్రమార్కుడికి ఇంద్రుడు ఇచ్చిన వెయ్యి ఏండ్ల రాజ్యపాలన వరం పూర్తయ్యింది.

విజయం శాలివాహనుడిని వరించింది.

యుద్ధంలో ఓడిన విక్రమార్కుడు, భట్టి కుమారులు సశరీరంతో ఇంద్రలోకానికి వెళ్ళిపోయారు.

**- సమాప్తం -**





# భట్టి-విక్రమార్క కథలు

## ప్రారంభం

ఉజ్జయిని రాజ్యాన్ని భోజమహారాజు పరిపాలిస్తున్నాడు. రాజుకు ఉండవలసిన సకల సుగుణములతో ధర్మప్రభువుగా ప్రజలచేత కీర్తింప బడుతూ...

అష్టలక్ష్ములు కొలువై ఉన్న ఉజ్జయిని సాటి రాజ్యాలకంటే వైభోపేత మయిన రాజ్యంగా కీర్తి శిఖరాలకు అధిరోహింప చేసిన ప్రభువతడు.

ఒకనాడు భోజమహారాజు మంత్రులు, సైన్యాధిపతి, కొంత మంది సేవకులను మొదలైన మందిమార్బలాన్ని వెంటపెట్టుకుని అడవికి వేటకు వెళ్ళాడు.

ఆ కాలంలో మృగయావినోదం రాజులకు కాలక్షేపమేకాదు. వీరత్వానికి ప్రతీక... క్రూర జంతువుల బారినుంచి అడవికి సమీపాన ఉన్న గ్రామాలను కాపాడటానికి రాజులు తప్పనిసరిగా ఆరు మాసాలకు ఒక్క సారన్నా వేటకు పోయేవారు.

రెండు రాత్రుళ్ళు భోజుడు అడవిలోనే బస చేసి రెండు చిరుతలను తన శరాస్త్రములకు బలిపెట్టాడు.

మూడవనాటి పగటి సమయంలో గుడారములు వదిలి వేటలో రాజు, పరివారం నిమగ్నమై ఉన్న సమయంలో మదించిన ఏనుగుల గుంపు ఒకటి గుడారాలపై బడి కాళ్ళతో త్రొక్కుతూ తొండముతో అందిన వాటిని అందినట్లు విసిరేస్తూ వాటన్నింటిని ధ్వంసం చేసి పారేసాయి.

వారం నాటికి సరిపడ్డ ఆహార సామగ్రి ఇతర వస్తువులు అన్నీ ఆ మదపటేనుగుల కాళ్ళక్రిందపడి ధ్వంసమైపోవటంతో తప్పని సరి పరిస్థితుల్లో భోజరాజు ఆనాటితో వేటను చాలించి తిరిగి ఉజ్జయినికి బయలుదేరాడు.

మార్గం మధ్యలో ఒక బ్రాహ్మణ అగ్రహారం సమీపిస్తుండగా ఏపుగా పెరిగిన ఒక జొన్న చేనులో మంచె మీద ఉన్న ఆ పొలం యజమాని రాజును, భటులను చూసి...

"రాజా! రాక... రాక మా గ్రామానికి వచ్చావు. నిన్ను... నీ భటులను చూస్తుంటే ఆహారం లేక నీరసించినట్లున్నారు. రండి నా పొలంలో తియ్యని జొన్న కంకులున్నాయి. వాటితో మీ ఆకలి తీర్చుకోండి" అంటూ ఆహ్వానించాడు.

ఆ రైతు మాటలకు రాజు అతని పరివారం ఎంతగానో సంతోషిస్తూ...

ఆహాఁ... ఇతడెవరో ఉత్తముడులా ఉన్నాడు. నోరు తెరిచి అడగనిదే అమ్మయినా అన్నము పెట్టదన్నది లోకోక్తి. కానీ ఈ రైతు అడగకుండానే జొన్న కంకులు తిని ఆకలిని తీర్చుకోమని ఆహ్వానిస్తున్నాడు కదా... అనుకుని రాజు అనుమతికోసం చూసారు.

భోజరాజు తన మంత్రితో "మంత్రివర్యా! అతడు చెప్పినట్లు చేస్తే సైనికులకు కొంత జవసత్వాలు వస్తాయి కదా..." అన్నాడు.

అవును ప్రభూ.... రాజును కొద్ది ప్రజలు అంటారు మీరు ధర్మబుద్ధి కలవారు కనుక మీ పాలనలో ప్రజలంతా అదే బుద్ధిని కలిగి ఉంటారు.

అతడు చెప్పినట్లే చేద్దాం... కావాలంటే ఉజ్జయిని పోయాక అతడికి కొంత ధనాన్ని పంపుదాం... అంటూ సలహా ఇచ్చాడు.

భోజరాజు సైనికులతో "భటులారా! మీరంతా చేనులోకి పోయి జొన్నకంకులు తినండి..." అంటూ అనుమతిని వారికిచ్చాడు.



భటులంతా ఎంతో ఆనందిస్తూ ఒక్కసారి గుంపుగా ఆ జొన్న చేలోకి చొరబడి చేతికి అందిన జొన్న కంకులను విరుచుకుని ఆత్రంగా తినసాగారు.

భోజరాజుకి, మంత్రికి, సైన్యాధిపతి పొలం గట్టునున్న కంకులను కోసి ఇచ్చాడు. ఒక కంకి తిన్నభోజుడు...

ఆహాఁ ఏమి మాధుర్యము తేనె పూత పూసినట్లు ఈ కంకులు ఎంత తియ్యగా ఉన్నాయి అనుకున్నాడు.

సైనికులు సందడి... సందడిగా ఒకటి తర్వాత ఒకటి జొన్న కంకులను తింటూ ఆ పొలం యజమాని ఉదార గుణాన్ని పొగడసాగారు.

మంచె మీద ఉన్న పొలం యజమాని భోజుడితో "ఆహాఁ.. రాజా ఏమి నా భాగ్యము అడిగిన వారందరికి అన్నము పెట్టే అన్నదాతవు నీవు. అటువంటి నీ ఆకలి ఈ నాటికి తీర్చే భాగ్యము నాకు దక్కిందకదా" అంటూ మంచె దిగి క్రిందకు వచ్చాడు.

మంచెను వదిలి ఇవతలకు వచ్చిన మరుక్షణం ఆ పొలం యజమాని ప్రవర్తన మారిపోయింది.



అయ్యోయ్యో... కష్టపడి పెంచుకున్న పంట సర్వనాశనం చేస్తున్నారు.

"రాజా! లోకమంతా నువ్వు ధర్మప్రభువని కీర్తిస్తోంది. అటువంటి నీ సమక్షంలోనే నీ భటులు పరుల సొమ్మును తెగబడి సొంతం చేసుకుంటుంటే వారితో చేరి నీకు కూడా తింటున్నావా" అంటూ దూషిస్తూ భోజుడిని అతడి పరివారాన్ని నానారకాలుగా శాపనార్థాలు పెట్టసాగాడు.

భోజుడు అతడి పరివారం విస్తుపోయారు.

ఆ రైతు అంతటితో ఆగక...

రాజా! రాజ్యంలో ప్రజలెవరన్నా తప్పు చేస్తే రాజుకు చెప్పుకుంటారు. ఆ రాజే తప్పు చేస్తే ఇక వారికి దిక్కు ఎవరు...?

నాకు ఈ పంటే జీవానాధారము అటువంటి దాన్ని నీవూ... నీ పరివారం కలసి దోచుకున్నారు. నీకిది న్యాయమా అంటూ నిలదీసాడు.

అతడి విచిత్ర ప్రవర్తనకు భోజుడు అతడి పరివారం మతులు చెడి బొమ్మల్లా నిలబడిపోయారు.

కొంతసేపటికి మంత్రి తేరుకుని ఆ రైతుకు క్షమార్పణలు చెప్పుకుని ఉజ్జయిని చేరగానే అతడికి నష్టపరిహారం పంపుతామని మాట ఇచ్చి శాంతింపచేసి భటులను ముందుకు కదలమన్నాడు.

ఆ రైతు తిరిగి మంచె పైకి చేరుకున్నాడు.

వెళ్ళిపోతున్న రాజును, పరివారాన్ని చూస్తూ....

"రాజా... నా మాట మన్నించక పోతున్నావేం? నా పొలంలో జొన్న కంకులు నచ్చలేదా? నీకు ఆతిధ్యము ఇవ్వటానికి నేను తగిన వాడిని కానన?" అంటూ పిలిచాడు.

భోజుడు అతని మాటలు విని ఆశ్చర్యపోతూ...

"మంత్రివర్యా... ఏమిటి ఈ విచిత్రం..." అనడిగాడు.

మంత్రి కూడా ఆశ్చర్యపోయి...

"రాజా! ఇదేదో విచిత్రంగానే ఉంది... ఈ సంగతి ఏదో ఇప్పుడే తేల్చేస్తాను" అన్నాడు ఆవేశంగా....

"తొందరపడకు ఈ విచిత్రం ఏమిటో చూడాలంటే అతడు చెప్పినట్లే మళ్ళీ మనం పోయి జొన్నకంకులు తిందాం" అని చెప్పి భటులను జొన్న కంకులు తినమని చెప్పాడు భోజుడు. తాను మాత్రం వాటిని ముట్టకుండా ఆ రైతును గమనిస్తూ గట్టున ఉండిపోయాడు.

భటులందరూ పొలంలోకి దిగి జొన్న కంకులను తాపీగా తినసాగారు.

కొంత సేపటికి మంచెపైన ఉన్న ఆ రైతు...



"రాజా! నువ్వెంతో ధర్మబుద్ధి కలవాడివి. నీ మనసు నొప్పించి ఉంటే క్షమించు. వ్యాధిని... ఆకలిని దాచుకోరాదు నీ పరివారం అందరూ ఆకలి తీర్చుకుంటున్నారు. నీవు మాత్రం నోరుకట్టేసుకుని నన్నే చూస్తున్నావు.

నీవు జొన్న కంకులు ముట్టకుండా కూర్చుంటే నేను వీరందరి ఆకలిని తీర్చినా... నాకు తృప్తి కలగదు.

కనుక నాలుగు కంకులను నీవు కూడా తిని నాకు తృప్తి కల్గించు" అంటూ వేడుకున్నాడు.

ఆ రైతు అంతగా బ్రతిమాలటంతో భోజుడు కూడా రెండు కంకులను విరుచుకుని తినసాగాడు. ఆ దృశ్యం చూసాక ఆ పొలం రైతు తృప్తి చెంది మంచె మీద నుండి క్రిందకు దిగాడు.

మంచె దిగిన మరుక్షణం మళ్ళీ ఆ రైతు ప్రవర్తన విచిత్రంగా మారిపోయింది.

రాజా! నీవు నేను ఎంత చెప్పినా నా మాటలను పట్టించు కోవటం లేదు. నా పంటనంతా నీవు, నీ సైనికులు కలిసి దోచేసు కుంటున్నారు.

రాజా! నీవు నీ పరివారం తక్షణం ఈ చోటును వదిలి అవతలకు వెళ్ళకపోతే నీ ముందే ఆత్మార్పణం చేసుకుని మరణిస్తాను.

రాజంటే ప్రజల యోగక్షేమలను చూసేవాడు. కానీ ఇలా సంపదను దోచుకునేవాడుకాదు. అంటూ కఠినాతి కఠినమైన పదజాలంతో భోజుడిని దూషించాడు.

భోజుడికి అతడి ప్రవర్తనలో ఏదో మర్మం ఉందని అర్ధమయ్యి అతడితో "అయ్యా! క్షమించు. ఆకలితో ఉండి నేను, నా పరివారం నీ పంటను దోచుకున్నాము.

అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటాను" అంటూ అతడ్ని శాంతింప చేసాడు.

ఆ తర్వాత మంత్రితో చర్చించాడు.

"రాజా! ఆ మంచె ఉన్న ప్రదేశంలో ఏదో మహత్తు ఉన్నది. అక్కడ ఉన్నవాడు ధర్మబద్ధంగా, పరోపకారగుణముతో ప్రవర్తిస్తున్నాడు ఆ చోటును వదలగానే తిరిగి అతడే స్వార్ధసంకుచిత బుద్ధితో ప్రవర్తిస్తున్నాడు. కనుక

ఆ మంచె ఉన్న ప్రదేశాన్ని తవ్వి చూస్తే గానీ ఈ రైతు ప్రవర్తనకు కారణము మనకి అర్థంకాదు" అంటూ వివరించాడు.

భోజుడికి అది నిజమనిపించింది.

రైతును ఒప్పించి అతడికి మరోక చోట భూమిని లెక్కలేనంత ధనరాశిని ఇచ్చేట్లు తీర్మానించి ఆ పొలాన్ని తన ఆధీనంలోకి తీసుకుని మంచె ఉన్న ప్రాంతాన్ని తవ్వవలసిందిగా భటులను ఆజ్ఞాపించాడు.

భోజుడు స్వాధీన పరుచుకున్న పొలంలో మంచె ఉన్న ప్రాంతాన్ని భటులు పగలు, రాత్రి ఎడతెరిపి లేకుండా తవ్వుతూ శోధించారు.

లోతుగా... భూమి లోపల ఒకనాటి ఉదయం ఒక అద్భుతమైన సింహాసనం బయట పడింది.

అప్పటికి రెండు వేల సంవత్సరాలకు పూర్వం ఇంద్రుడు విక్రమార్కుడికి కానుకగా ఇచ్చిన బంగారు సింహాసనం అది.

ఆ సింహాసనానికి ముప్పది రెండు మెట్లు, ఆ మెట్లపై ఒక్కొక్క సాలభంజిక ఉండి ఎంతో చూడముచ్చటగా ఉంది.

భోజుడు ఆ సింహాసనాన్ని ఉజ్జయినీకి తరలించి సభలో ప్రతిష్ఠించాడు.

ఆ సింహాసనాన్ని చూడటానికి గ్రామ, గ్రామల నుండి ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు.

మంత్రి సలహానుసారం భోజుడు ఆ సింహాసనాన్ని అధిష్ఠించి ఉజ్జయినినీ పాలించాలని నిశ్చయించుకున్నాడు.

ఆ సముహూర్త కాల మందు బంధు, మిత్ర, జనం మంది మార్బల పరివారం వెంట తరలిరాగా విక్రమార్క సింహాసనాన్ని అధిష్ఠించటానికి భోజుడు తొలి మెట్టుపై అడుగు వెయ్యగా... సింహాసనం మీద సాలభంజిక మానవ భాషలో మాట్లాడుతూ "ఆగు భోజరాజా" అంటూ హెచ్చరించింది.

భోజుడు సాలభంజిక ప్రాణం వచ్చినట్లు మాట్లాడటంతో ఆశ్చర్య చకితుడై నిలబడిపోగా...

"రాజా! ఈ సింహాసనం విక్రమార్క చక్రవర్తి సింహాసనం. వీరుడు, ధీరుడు, సాహసి, క్షత్రియ ధర్మాలు, విద్యలు ఎరిగినవాడు.



ఇంద్రుడి చేత బహుమానంగా ఈ సింహాసనం పొంది రెండువేల ఏళ్ళు ఈ ఉజ్జయినీ సామ్రాజ్యాని ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించిన మహావీరుడైన ఆ చక్రవర్తికి ఉన్న అర్హతలు నీకున్నట్లయితే ఈ సింహాసనాన్ని అధిరోహించు...

ఆ చక్రవర్తి పాదధూళితో వందలకొద్ది ఏళ్ళు మేమంతా పునీత మయ్యాము.. సాహసోపేతమైన ఆయన కార్యాలతో... ధర్మబుద్ధి కల పాలనతో పులకించిపోయాము.

విక్రమార్క చక్రవర్తి సాహస కథను నీకు చెప్తాను. విని నీవే నిర్ణయించుకో" అంటూ మొదటి మెట్టుపై ఉన్న సాలభంజిక విక్రమార్కుడి సాహస కథను ప్రారంభించింది.

ఆ విధంగా ముప్పైరెండు సాలభంజికలు ముప్పై రెండు రోజులపాటు ప్రతిదినం భోజమహారాజుకి విక్రమార్కుడి సాహసం, ధర్మబుద్ధి, పరోపకారం వంటి విభిన్నమైన గుణములకు సంబంధించిన కథలను చెప్పి చివరుకు ఇటువంటి గుణం నీకున్నదా? అని ప్రశ్నించసాగాయి.

అలా ముప్పెరెండు సాలభంజికలు చెప్పిన కథలు విన్నాక ఆ సింహాసనాన్ని అధిష్ఠించిన విక్రమార్కుడికి ఉన్న అర్హతలు తనకు లేవని భోజుడు ఒప్పుకొనుటతో విక్రమార్కుడి సింహాసనం తిరిగి ఇంద్రలోకం వైపు ఎగిరిపోయింది.

## భట్టి-విక్రమార్క చరిత్ర

పూర్వం ఒక బ్రాహ్మణ అగ్రహారంలో విద్యాధరుడు అనే ఒక యువకుడు ఉండేవాడు.

విద్యాధరుడు లేత యవ్వన ప్రాయంలోనే సకల శాస్త్రాలను చదివి అవగతం చేసుకున్నాడు.

అయినా అతడికి తృప్తి కలుగలేదు.

తనునేర్చింది అణువంతా...నేర్చాల్సి ఉన్నది సముద్రమంతా అనుకుని తగిన గురువును అన్వేషించటానికి ఒకనాటి రాత్రి ఇల్లు విడిచి బయలుదేరాడు.

ఎంతో కాలం దేశ, దేశాలను తిరిగాడు. ఎందరో గురువులను కలుసుకున్నాడు.

వారంతా విద్యాధరుడిని పరీక్షించి సకల శాస్త్రాలలో పట్టు సాధించిన అతడు తమకంటే ఉద్దండుడని అటువంటి వానికి విద్య నేర్పే శక్తి తమకిలేదని చెప్పారు.

విద్యాధరుడు మాత్రం సంతృప్తి చెందలేదు.

ఎంతో నిరాశ చెందాడు.

పట్టు విడవక తన విద్య దాహం తీర్చుకోవాలని నిర్ణయించుకుని తగిన గురువును వెతుకుతూ కొత్త ప్రాంతాలు తిరుగుతూనే ఉన్నాడు.

ఒకనాటి మధ్యాహ్నం వేళ విద్యాధరుడు అడవి మార్గంలో ప్రయాణిస్తూ అలసిపోయి విశ్రాంతి తీసుకోవటానికి ఒక పెద్ద మర్రిచెట్టు క్రింద విశ్రమించాడు.

ఆ మర్రిచెట్టుపై ఒక బ్రహ్మరాక్షసుడు నివశిస్తున్నాడు. ఆ సమయంలో అతడు చెట్టును వదలి అవతలకి పోయి ఉన్నాడు.

తిరిగి వచ్చిన బ్రహ్మరాక్షసుడు చెట్టు క్రింద విశ్రాంతి తీసుకుంటున్న విద్యాధరుడిని చూసి అతని మొఖంలో ఉట్టిపడుతున్న తేజస్సుకు ముగ్ధుడై...

"ఆహాఁ... ఇతడెవరో ఉత్తమ పురుషుడిలా ఉన్నాడు. అలసట వల్ల ఇక్కడ విశ్రమించి ఉంటాడు. ఇతడు నిద్రలేచే వరకు వేచి ఉండి వివరాలు తెలుసుకోవాలి...." అనుకుని కొద్ది దూరంలో కూర్చున్నాడు.

కొంత సేపటికి విద్యాధరుడు నిద్రలేచి బ్రహ్మరాక్షసుడిని చూసి కొంచెం కలవరపడ్డాడు.

కలవరంతో పాటు భయం కూడా కల్గింది.

అమ్మో... ఈ రాక్షసుడు నా కోసమే కాచుకుకూర్చునట్లు ఉన్నాడు ఇప్పుడు నన్ను విరుచుతింటాడు కాబోలు అయినా నా విద్యా దాహం తీరకుండా మరణం వస్తే అంతకంటే వేరొక దౌర్భాగ్యం ఉండదు కదా అనుకుంటూ కళ్ళ వెంట రెండు కన్నీటి చుక్కలు రాల్చాడు.

విద్యాధరుడి కలవరం గమనించిన బ్రహ్మరాక్షసుడు భయపడకు నువ్వెవరు? ఎక్కడకు పోతున్నావు? అంటూ అతడిని ప్రశ్నించాడు.



విద్యాధరుడు తన కథనంతా బ్రహ్మరాక్షసుడికి చెప్పాడు.

బ్రహ్మరాక్షసుడు ఆనందపడిపోతూ....

"ఆహాఁ... ఇన్నాళ్ళకు నా నిరీక్షణ ఫలించింది..." అన్నాడు.

విద్యాధరుడు ఆశ్చర్యచకితుడై....

రాక్షసోత్తమా... నువ్వెవరు? అనడిగాడు.

నేను గంధర్వ పురుషుడిని. బ్రహ్మర్షి త్రిలోక సంచారి అయిన నారద మహర్షి శాపానికి గురయ్యి భూలోకంలో బ్రహ్మరాక్షసుడినై పడి ఉన్నాను.

నేను నేర్చిన విద్యలన్ని విద్యాదాహం కలిగిన వారికి సంపూర్ణంగా నేర్పిస్తే నాకు శాపవిమోచనం కలుగుతుందని ఆ మహర్షి సెలవిచ్చాడు. కనుక నేటి నుండి నిన్ను నా శిష్యుడిగా స్వీకరిస్తున్నాను.

శిష్యా.... ఆరు నెలలు పాటు ఆహోరాత్రులు నీవు సాధన చేయవలసి ఉంటుంది. కనుక నీకు ఆకలి దప్పులు లేకుండా ఉండటానికి ముందుగా ఒక మంత్రం ఉపదేశిస్తాను పఠించు...

ఆ మంత్ర ప్రభావంచేత నీవు విద్యను నేర్చుకుంటున్నంతా కాలం నీకు ఆకలి దప్పులు ఉండవు. అని చెప్పి తిరిగి మళ్ళీ రాక్షసుడు విద్యాధరుడుతో ఈ విధంగా చెప్పాడు.

నేను చెట్టుపై నుండి రావి ఆకులపై శ్లోకాలను లిఖించి క్రిందకు పడవేస్తాను.

నీవు వాటిని చదువుకుని అర్ధంచేసుకో... అంటూ బ్రహ్మ రాక్షసుడు విద్యాధరుడికి చెప్పాడు.

ఎంతో సంతోషించిన విద్యాధరడు బ్రహ్మరాక్షసుడిపాదాలకు నమస్కరించి విద్యాసాధనకు ఉపక్రమించాడు.

ఆరు నెలల కాలంలో ఆ రాక్షసుడు తనకు తెలిసిన విద్యనంతా విద్యాధరుడికి నేర్పించాడు.

నారద మహర్షి చెప్పినట్లు బ్రహ్మరాక్షసుడికి శాపవిమోచనం కలిగి గంధర్వ రూపం తిరిగి వచ్చింది.

విద్యాధరుడిని ఆశ్వీరదించి నీకు తెలిసిన విద్యను నలుగురికి పంచు అని చెప్పి గంధర్వలోకం వెళ్ళిపోయాడు.

విద్యాధరుడు విద్యార్జన పట్ల తృప్తి కలిగి తిరిగి తన గ్రామానికి ప్రయాణమయ్యాడు.

ఆరునెలల పాటు నిద్రాహారాలు లేక ఏకదీక్షతో విద్యాసాధన చేయటం వల్ల విద్యాధరుడిలో శక్తి నశించిపోయింది.

అతడి దేహంలో ఒక్క అవయవము అతడి మాటను వినే స్థితిని దాటిపోయిన్నంతగా అలసిపోయాడు.

ఆ అలసటతో ఒక గ్రామాన్ని చేరుకున్నాడు.



ఒకగ్రామంలో విశ్రాంతి తీసుకోవటానికి తగిన చోటును వెతుకుతూ నడుస్తుండగా అతడు స్పృహతప్పి ఓ ఇంటి ముందు పడిపోయాడు.

ఆ ఇల్లు ఒక వేశ్యది. ఆమెకు రత్నావతి అనే కుమార్తె ఉంది. రత్నావతి చక్కని అందం కలిగినదే కాదు. సకల సుగుణాలరాశి తన గుమ్మం ముందు పడిపోయిన విద్యాధరుడిని చూసి ఎంతో జాలిపడి అతడిని ఇంటిలోకి తీసుకుపోయి సేవలు చేసింది.

కొంత కాలానికి విద్యాధరుడు ఆరోగ్యవంతుడయ్యాడు. రత్నావతికి కృతజ్ఞతలు తెలుపుకుని అతడు తన గ్రామానికి ప్రయాణమవ్వటానికి సిద్ధపడగా...

రత్నావతి అతడిని అడ్డగించి...



"అయ్యో! తొలిచూపులోనే నిన్ను వలచాను. అందుకనే ఒక కన్య పరపురుషుడికి చేయని సేవలన్నీ చేసాను. ఇప్పుడు నీ దారిన నీవు వెళ్ళిపోతాననటం ఏం న్యాయం... నా గతి ఏం కాను" అంటూ నిలదీసింది.

విద్యాధరుడు అవాక్కయ్యి... అంతలోనే తేరుకుని....

"అమ్మా! నీవు చేసిన ఉపకారం జన్మజన్మలకు మరువరానిది. కానీ నేను బ్రహ్మణ పుత్రుడిని నిన్ను పెళ్ళి చేసుకుని కులభ్రష్టుడిని కాలేను" అంటూ తన దారిన తనని పోనివ్వమని ప్రాధేయపడ్డాడు.

రత్నావతి అంగీకరించలేదు...

ఇద్దరి మధ్య ఇంట్లో మొదలైన వాదం రచ్చకెక్కి చివరకు న్యాయం కోసం రాజు సభ వరకు పోయింది.



రాజుకు రత్నావతి అన్ని విషయలు చెప్పి "ప్రభూ... మనసా,వాచా, కర్మణా అతడే నా భర్త అని నిర్ణయించుకుని చేయవలసిన సేవలన్ని చేసాను.

ఈ జన్మకి ఈ విద్యాధరుడిని తప్ప మరొకరిని నా భర్తగా అంగీకరించను. జరిగితే అతడితో నా పెండ్లి జరగాలి. లేదా నేను ఆత్మార్పణం చేసుకుని మరణిస్తాను" అంటూ చెప్పింది.

"విద్యాధరుడు బ్రాహ్మణ యువకుడు అతడు రత్నావతిని పెండ్లాడుటకు ధర్మ శాస్త్రం ఒప్పుకోదు. రత్నావతి చూస్తే విద్యాధరుడితో

పెండ్లి జరగకపోతే మరణిస్తానటోంది. ఇప్పుడు ఏం చెయ్యాలి" అంటూ మంత్రులను సలహా అడిగాడా రాజు.

మంత్రులు ఒక్కరోజు గడువు కోరి ధర్మ శాస్త్రాలన్ని తిరగవేసి ఒక పరిష్కారం కనుగొని రాజు దగ్గరకు వచ్చి....

రాజా! విద్యాధరుడు కుల భ్రష్టుడు కాకుండా రత్నావతిని పెండ్లాడటానికి చక్కని పరిష్కారం ఉంది.

అతడు ముందుగా బ్రాహ్మణ కన్యను, తరువాత వైశ్యకన్యను, తరువాత క్షత్రియ కన్యను వివాహమాడి చివరగా రత్నావతిని పెండ్లాడితే ధర్మశాస్త్రం అంగీకరిస్తుంది అని చెప్పారు.

రాజు విద్యాధరుడిని ఒప్పించి ముందుగా తన ఆస్థాన పురోహితుడి పుత్రికను, తర్వాత వైశ్య ప్రముఖుని కుమార్తెలతోనూ, తర్వాత రాజు కుమార్తెతోనూ, వివాహం జరిపించి ఆఖరికి విద్యాధరుడికి రత్నావతిని ఇచ్చి పెండ్లి జరిపించి విద్యాధరుడిని రాజును చేసి తను తపస్సు చేసుకోవ టానికి అడవులకు వెళ్ళిపోయాడు.

కొంతకాలానికి విద్యాధరుడి నలుగురు భార్యలు నలుగురు పుత్రులను కన్నారు.

విద్యాధరుడు స్వయంగా వారికి సకల శాస్త్రాలను నేర్పించి విద్యాపారంగతులుగా తీర్చిదిద్దాడు.

బ్రాహ్మణ కన్యకు పుట్టిన యువకుడు తండ్రివలే విద్యాదాహంతో యవ్వనంలోనే ఇల్లువిడిచి వెళ్ళిపోయాడు.

రత్నావతికి పుట్టిన పుత్రుడు తను నేర్చిన విద్యను ఆశ్రమం ఏర్పరిచి నలుగురికి నేర్పుతానని ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు.

క్షత్రియ కన్యకు పుట్టిన విక్రమసేనుడిని మహారాజుగా పట్టాభిషేకం జరిపించి...

వైశ్యకన్యకు పుట్టిన భట్టిని అతడికి మంత్రిగా నియమించి విద్యాధరుడు తన నలుగురు భార్యలతో కలసి తపస్సు చేసుకునేందుకు అడవులకు వెళ్ళిపోయాడు.



# ఇంద్రుడి వరం

ఉజ్జయినీ నగరాన్ని విక్రమార్కుడు జనరంజకంగా పరిపాలిస్తున్నాడు.

వీరుడు...

దయామయుడు...

బుద్ధిశాలి...

పరోపకార బుద్ధి మెండుగా ఉన్న విక్రమార్కుడి పాలనలో ప్రజలంతా ఎంతో సుఖశాంతులతో జీవిస్తున్నారు.



ఒకనాడు ఇంద్రలోకం నుండి విక్రమార్కుడి దగ్గరకు ఒక దూత వచ్చి... "మహారాజా! నేను ఇంద్రలోకం నుండి దేవేంద్రుడు పంపగా వచ్చిన దూతను... ఇంద్రలోకలో రంభా, ఊర్వశుల ఇద్దరి మధ్యన ఎవరు గొప్ప నాట్యకత్తె అన్న సమస్య వచ్చింది.

ఆ సమస్యని తీర్చడానికి ఇంద్రుడు ధర్మనిర్ణయకుడు అయినటువంటి నర లోకాధిపతి అయిన యముడు, కుబేరుడు, సప్తఋరుషులు, గంధర్వ, యక్షులు వంటివారు ఎందరో ప్రయత్నించారు. కానీ వారివల్లకాలేదు.

అందుచేత ఇంద్రులవారు తమరు దేవలోకం వచ్చి వారిద్దరి మధ్యన జరిగే నాట్యం తిలకించి సమస్యను పరిష్కరించవలసిందిగా కోరారు" అంటూ ఇంద్రుడు పంపిన సందేశం వినిపించాడు.

విక్రమార్కుడు భట్టితో సంప్రదించి ఆ దూతవెంట ఇంద్రలోకం వెళ్ళి రంభా, ఊర్వశిల నాట్య ప్రదర్శన తిలకించి ఊర్వశిని విజేతగా నిర్ణయించాడు.

రంభ అందుకు అభ్యంతరం చెప్పింది.

అప్పుడు విక్రమార్కుడు ఆమెతో ఇలా చెప్పాడు.

"నాట్యం చక్కగా చేయటంతో పాటు సున్నితంగా శరీర కదలికలను ప్రదర్శించటమే నాట్యం.

మీ ఇద్దరి మెడలో ఉన్న పూల దండలలో నీ మెడలోని పూల దండలో సగభాగం పూలు రాలి పోయాయి. కానీ ఊర్వశి మెడలో ఉన్న పూల దండలో పూలు మాత్రం ఒక్కటి కూడా క్రిందకు రాలలేదు. కనుక ఆమె నిజమైన నాట్యకత్తె" అంటూ వివరించాడు.

ఆ వివరణతో రంభ తన తప్పును తెలుసుకుని ఊర్వశియే తనకంటే గొప్పని ఒప్పుకుంది.

దేవేంద్రుడు విక్రమార్కుడి సునిశిత దృష్టిని ఎంతగానో మెచ్చుకుని బంగారు సింహాసనాన్ని కానుకగా సమర్పించి... "రాజా! ఈ సింహాసనంపై కూర్చుని ఉజ్జయినీ సామ్రాజ్యాన్ని వెయ్యేళ్ళు జనరంజకంగా పరిపాలించు" అంటూ ఆశ్వీరదించాడు.

## భట్టి కాళికా వరం పొందుట

భట్టి కుమారుడు తెలివైనవాడు. ఏ విషయమునైనా తమకు అనుకూలంగా మార్చగలవాడు.

విక్రమార్కుడికి ఇంద్రుడిచ్చిన వరం వినగానే అతడు "సోదరా... నువ్వు వెయ్యేళ్ళు కాదు రెండువేల ఏళ్ళు ఈ ఉజ్జయిని సామ్రాజ్యాని పరిపాలించగలవు" అంటూ ఆనందంగా చెప్పాడు.

"ఎలా...?" అంటూ ఆశ్చర్యపోయాడు విక్రమార్కుడు.

"సోదరా... ఇంద్రుడు ఈ సింహాసనంపై కూర్చుని నిన్ను వెయ్యేళ్ళు పరిపాలించమన్నాడు కదా... నీవు ఆరు నెలలు సింహాసనంపై కూర్చుని రాజ్యపాలన చేయి మిగిలిన ఆరు నెలలపాటు దేశాటన చేయి. అలా చేస్తే నీవు సింహాసనంపై కూర్చున్న ఆరు నెలలే లెక్కలోకి వస్తాయి.

ఇంద్రుని వాక్కు అసత్యం కాదు...

నీవు ఉజ్జయినిని రెండువేల ఏళ్ళు పాలించవచ్చు. ఆరు నెలలు దేశాటన చేసిన అనుభవం రాజ్యపాలనకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అంటూ చక్కని ఉపాయం చెప్పాడు.



విక్రమార్కుడికి ఆ ఉపాయం నచ్చింది.

భట్టి తోడులేకుండా తను రెండు వేల ఏళ్ళు ఉజ్జయినిని పాలించటానికి అతడి మనసు అంగీకరించక... అదే మాట భట్టితో చెప్పాడు.

భట్టి బాగా ఆలోచించి "సోదరా నువ్వు దిగులు పడకు. మన వేల్పు అయిన కాళీమాతను తపస్సు చేసి ప్రసన్నం చేసుకుని నేను రెండువేల ఏళ్ళు జీవించేట్లు వరం పొంది వస్తాను. అంత వరకు వేచి ఉండు" అని చెప్పి తపస్సుకు వెళ్ళిపోయాడు.

అరణ్యంలో ఒక రావి వృక్షం క్రింద భట్టి ఏళ్ళ తరబడి ఘోరమైన తపస్సును చేసి కాళికామాత దర్శనం పొంది తనకి రెండు వేల ఏళ్ళు జీవించేట్లు వరం ఇమ్మని కోరాడు.



కాళికాదేవి చిరునవ్వు చిందిస్తూ...

"కుమారా! నీవు కోరిన వరం అనితర సాధ్యమైనది. నీకు రెండు వేల ఏండ్లు జీవించేవరం కావాలంటే వెళ్ళి నీ అన్న అయిన విక్రమార్కుడిని తీసుకువచ్చి అతడిని నాకు బలి ఇవ్వు" అని అంతర్థానమైపోయింది.

భట్టి తిరిగి వచ్చి జరిగింది విక్రమార్కుడికి చెప్పగా....

"సోదరా... వెంటనే పద ఆ దేవి కోరినట్లు నన్ను ఆమెకు బలి ఇచ్చి వరం పొందు. నువ్వే ఈ ఉజ్జయినిని రెండు వేల ఏండ్లు పరిపాలించు అంటూ ముందుకు వచ్చాడు.



భట్టి నవ్వుతూ విక్రమార్కుడితో...

"సోదరా.... అంత అగత్యం లేదు. ఇంద్రుడు ఇచ్చిన వరం ప్రకారం నీకు వెయ్యేళ్ళు మరణం లేదు. కనుక నిన్ను బలి ఇచ్చినా ఆ దేవి తిరిగి బ్రతికిస్తుంది.

ఒకవేళ అలాకాక నీవు మరణిస్తే.. నీవెంట నేను కూడా మరణిస్తాను" అంటూ తన ఆలోచన చెప్పాడు.

ఆ తర్వాత ఇద్దరూ కలసి ఆ కాళికాదేవి ఆలయం చేరుకుని భట్టి విక్రమార్కుడి శిరస్సు ఖండించి ఆ దేవికి బలి ఇచ్చాడు.

వెంటనే కాళికదేవి ప్రత్యక్షమయ్యి భట్టికి రెండు వేల ఏళ్ళు జీవించేట్లు వరం ఇచ్చి విక్రమార్కుడికి తిరిగి ఆయువు పోసి బ్రతికించింది.



# సాధువు తన రాక గురించి చెప్పుట

విక్రమార్కుడు ఉజ్జయిని నగరాన్ని జనరంజకంగా పరిపాలిస్తున్నాడు. భట్టి సలహాను అనుసరించి ఆరు నెలలపాటు రాజ్యపాలనను ఆరు నెలల పాటు దేశాటన చేస్తూ ఎన్నో వింతలను విశేషాలను తెలుసుకుంటూ అనితర సాధ్యమైన ఎన్నో సాహసాలను చేస్తూ ప్రజలందరి మన్ననలను పొందసాగాడు.

ఆరు నెలల దేశాటన ముగించి విక్రమార్కుడు ఆనాడే తిరిగి ఉజ్జయిని నగరాన్ని చేరుకున్నాడు.

విక్రమార్కుడి రాకతో అంతఃపురం కోలాహలంగా ఉంది. అందరిమొహాలలో ఆనందం తాండవం చేస్తోంది.

భట్టి కుమారుడు విక్రమార్కుడిని దర్శించుకుని క్షేమ సమాచారాలు ఆరు నెలల దేశాటనలో విక్రమార్కుడు పొందిన అనుభవాలను తెలుసు కున్నాడు.

విక్రమార్కుడు కొలువు దీరి మంత్రులతో సమావేశం జరుపు తుండగా...

ఒక సేవకుడు వచ్చి ఒక సాధువు విక్రమార్కుడి దర్శనానికి వేచి ఉన్నాడని విన్నవించాడు.

"ప్రవేశపెట్టు" అంటూ ఆ సేవకుడికి చెప్పి పంపాడు.

కాషాయాంబరధారి...

ఆరడుగుల ఆజానుబాహుడైన ఓ సాధువు విక్రమార్కుడిని దర్శించుకున్నాడు. ఆయనకి సముచిత గౌరవాలు చేసి...

"అయ్యా... తమరెవరు?" అనడిగాడు విక్రమార్కుడు.

ఆ సాధువు బదులివ్వకుండా తన జోలెలో నుండి ఒక పండును తీసి విక్రమార్కుడి చేతిలో ఉంచి నమస్కరించి మౌనంగా వచ్చిన దారిన వెళ్ళిపోయాడు.

ఆనాటి నుండి ఆ సాధువు ప్రతి దినం ఒకే సమయానికి విక్రమార్కుడి దర్శనం చేసుకుని ఒక పండును ఇచ్చి మారు మాట్లాడకుండా వెళ్ళిపో సాగాడు.

ఆ సాధువు ప్రతి దినం అలా పండు ఇచ్చి వెళ్ళటంలో ఏదో మర్మం ఉండి ఉంటుందని అదేమిటో ఆయన చెప్పినపుడే తెలుసుకోవచ్చని భట్టి సలహా ఇవ్వటంతో విక్రమార్కుడు మౌనం వహించాడు.

ప్రతిదినం ఆ సాధువు ఇచ్చిన పండ్లను సేవకుల ద్వారా భద్రపరచసాగాడు.

ఒకనాడు అలాభద్రపరిచిన పండు విచ్చుకుని దానిలో నుండి విలువైన వజ్రాలు బయటపడ్డాయి.

మర్నాడు తనకు పండు ఇవ్వటానికి వచ్చిన సాధువుతో విక్రమార్కుడు పండ్లలో వజ్రాలు ఉన్న విషయం ప్రస్తావించి....

''మహాత్మా! మీరు ప్రతిరోజు వజ్రాలున్న పండ్లను నాకు ఎందుకిస్తున్నారు. నా నుంచి ఏం ప్రతిఫలం ఆశిస్తున్నారో దయచేసి చెప్పండి" అంటూ ప్రాధేయపడ్డాడు.



ఆ సాధువు "రాజా! నేనీక యజ్ఞం తలపెట్టాను. అందుకని నీ సాయం కావాలి నాకు. నా యజ్ఞం పూర్తయితే లోక కళ్యాణం జరుగుతుంది" అంటూ విక్రమార్కుడికి చెప్పాడు.

సరే నన్నాడు విక్రమార్కుడు.

విక్రమార్కుడిని తన వెంట అడవిలో ఉన్న దేవి ఆలయానికి తీసుకుపోయి ఆ సాధువు ఇలా చెప్పాడు.



"రాజా! నా యజ్ఞం ఈ రాత్రి మూడోఝాముకల్లా పూర్తవుతుంది. ఆ సమయానికి నీవు ఇక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న మర్రిచెట్టుకు వేళ్ళాడుతున్న శవాన్ని తీసుకురావాలి.

అది మాములు శవం కాదు. అందులో బేతాళుడు ఆవహించి ఉన్నాడు. నీవు మౌనం పాటిస్తేనే ఆ శవాన్ని నీవు ఇక్కడకు తీసుకుని రాగలవు మౌనభంగం కలిగిందా బేతాళుడు తిరిగి ఆ చెట్టు మీదకు చేరిపోతాడు" అని చెప్పి విక్రమార్కుడిని విజయోస్తూ అని దీవించి పంపాడు.

విక్రమార్కుడు అర్థరాత్రి వేళ చీకటిలో ఆ మర్రిచెట్టును వెతికి పట్టుకుని బేతాళుడి శవాన్ని భుజం మీద వేసుకుని దేవి ఆలయం దగ్గరకు బయలు దేరాడు.

## బేతాళుడి పూర్వ గాథ

పూర్వం దండకారణ్య సమీపాన ఉన్న ఓ గ్రామంలో పురాతనమైన శివాలయం ఒకటి ఉన్నది.

ఆ ఆలయంలో పరమేశ్వరుడు స్వయంభూగా వెలసినందు వల్ల ఆ క్షేత్రం ఎంతో మహాత్యం కల క్షేత్రంగా ప్రసిద్ధిపొందింది.



ఒకనాటి శివరాత్రి సమయాన పార్వతీ పరమేశ్వరులు ఆ రాత్రి జాగారము చేయటానికి ఆ క్షేత్రాన్ని వేదికగా ఎంచుకుని అక్కడకి విచ్చేసారు.

కాస్సేపు లోకరీతుల గురించి ఆ ఆది దంపతులిద్దరూ ముచ్చటించు కున్నాక పార్వతి శివునితో...

"నాథా... నేను కథలు వినాలని ఆసక్తి పడుతున్నాను. అవి ఇంతకు ముందు ఎక్కడా జరుగనివి, ఎవ్వరూ విననివి, చూడనివి, తెలియని అయి ఉండాలి. అటువంటి కథలను మీ నోటి నుండి వినాలనుకుంటు న్నాను" అని కోరింది.

పరమశివుడు పార్వతి కోరికను మన్నిస్తూ...

"దేవి... నీ కోరిక ఎప్పుడు ఏది కాదన్నాను తప్పకుండా నీకు అటువంటి కథలను చెపుతాను. కానీ ఆ కథలు చెప్పటానికి ఒక షరతు ఉన్నది" అన్నాడు.

"ఏమిటది...?"

"నీకు కథలు చెప్పినాక ఆ కథలోని ఒక సమస్యను ప్రశ్నారూపంలో నిన్ను అడుగుతాను. నీవు ధర్మబుద్ధితో నిర్ణయం చేసి ఆ సమస్యను పరిష్కరించాలి" అన్నాడు.

"తప్పకుండా నాథా..."

పరమశివుడు కథను మొదలు పెట్టాడు.

పార్వతి ఎంతో శ్రద్ధగా వినసాగింది.

ఆ ఆలయపుజారి సోమశర్మ అంతకు ముందే గర్భగుడి తలపులను మూసి దీపారాధనలలో తైలమును నింపుతూ వత్తులను సరిచేస్తున్నాడు.

పార్వతీ పరమేశ్వరుల సంభాషణ అతని చెవులకు సోకింది....

ఆహాఁ... ఏమి నా భాగ్యం... ఎంతో కాలం తపస్సు చేస్తే కానీ పరమశివుడు ప్రత్యక్షంకాడు. అటువంటిది ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులను ఒకేసారి దర్శించుకునే భాగ్యం నాకు కల్గింది కదా... అనుకుని అతడు గర్భగుడి తలుపు దగ్గరకు చేరి దానికి ఉన్న రంధ్రాలలో నుండి పార్వతి పరమేశ్వరులను దర్శించుకుని భక్తిగా నమస్కరించుకుని పరమేశ్వరుడు, పార్వతికి చెప్తున్నా కథలను శ్రద్ధగా వింటూ గుమ్మం వద్దనే ఉండిపోయాడు.

పరమేశ్వరుడు అలా పార్వతికి ఇరవైనాలుగు కథలను చెప్పాడు.

ప్రతి కథకు చివర సమస్యను ప్రశ్నారూపంలో అడగటం పార్వతిదేవి ధర్మబుద్ధితో పరిష్కారం చెప్పటం... ఆ పరిష్కారానికి సంతృప్తి చెంది పరమేశ్వరుడు తర్వాత కథను ప్రారంభించటం జరుగసాగింది.

ఆ కథలను... పరిష్కారాలను సోమశర్మ బాగా బుర్రకు ఎక్కించు కున్నాడు.

ఇరవై నాలుగవ కథను పూర్తి చేసి పరమేశ్వరుడు సమస్యను ప్రశ్నారూపంలో పార్వతిని అడిగాడు.



సమాధానం పార్వతికి తోచలేదు...

ఎంతగానో ఆలోచించింది.

అప్పటికి తెల్లావారిపోయింది.

నాథా! నేను ఓడిపోయాను సమాధానం కూడా మీరే చెప్పండి. అంటూ పరమేశ్వరుడిని కోరింది పార్వతి.

పరమేశ్వరుడు చిరునవ్వు నవ్వి....

దేవి ఇప్పటికి తెల్లావారిపోయింది. సమాధానము నీకు కైలాసములో చెప్తాను. అంటూ పార్వతితో కలిసి అదృశ్యమైపోయాడు.

ఆ కథలు విన్న సోమశర్మ ఇంటికి వచ్చి భార్యకు జరిగిందంతా చెప్పాడు.

ఆమె ముందునమ్మలేదు...

కానీ...

సోమశర్మ పార్వతీ దేవికి పరమేశ్వరుడు చెప్పిన ఇరవైనాలుగు కథల్లో ఆమెకు ప్రశ్నాసమాధానాలతో ఇరవై మూడు కథలను చెప్పి ఇరవై నాలుగవ కథకు పరమశివుడు సమాధానం చెప్పకుండా అదృశ్యమైపోయిన వైనాన్ని ఆమెకు వివరించాడు.

అప్పుడు నమ్మిందామె...

ఆడవారినోట్లో ఆవగింజ నానదు కదా...

సోమశర్మ భార్యనోట్లో ఆదేవ రహస్యం దాగలేదు....

చుట్టు ప్రక్కల అమ్మలక్కలందరికి ఆ కథలు చెప్పింది.

వారు మరోకరికి చెప్పారు.

అతి కొద్ది కాలంలోనే ఆ కథలు భూలోకమంతా ప్రచరమయ్యాయి.

త్రిలోకసంచారి...

కలహాబోజుడు అయిన నారద మహర్షి ఒకనాడు భూలోక సంచారానికి వచ్చాడు.

భూలోకంలో ప్రచారంలో ఉన్న కథలను విని ఆశ్చర్యపోయాడు.

ఆహాఁ ఇటువంటి కథలను పుట్టించుట మానవ మాత్రులకు సాధ్యంకాదు కదా... ఈ కథలను పుట్టించినవాడు సురుడు అయిఉండాలి.

అనుకుని దివ్యదృష్టిని సారించాడు.

నారద మహర్షి మనోఫలకంపై పార్వతిదేవికి ఆ కథలను పరమ శివుడు చెబుతున్న దృశ్యం కన్పించింది.

ఇంకేముంది...

కలహ భోజుడికి కమ్మని విందు దొరికింది...

ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల మధ్యనే చిచ్చు రగల్చటానికి అగ్గిని పట్టుకుని కైలాసంకి బయలుదేరాడు.

కైలాసంకి వచ్చిన నారదుడ్ని చూసి పార్వతి ఎంతో సాదరంగా ఆహ్వానించి...

త్రిలోక సంచారి ఎక్కడనుంచి తమరిరాక.... అక్కడ విశేషాలు ఏమిటి? అంటూ ప్రశ్నించింది.

ఆ ప్రశ్న చాలుకదా నారదులవారికి...

"అమ్మా నేను భూలోక సంచారం చేసి వస్తున్నా" అన్నాడు.

"ఏమి అక్కడ విశేషాలు?"

"ఏం చెప్పమంటావ్ తల్లీ..." అంటూ నారదుడు నిట్టూర్చాడు.

"ఏమయింది నారద"

"ఏముంది తల్లీ భూలోకంలో ప్రస్తుతం జనబాహుళ్యంలో కొన్ని కథలు ఉన్నాయి...

ప్రతి కథ చివర ఒక సమస్య ప్రశ్నా రూపంలో కథకుడు అడుగుతాడు విన్నవాడు ధర్మబుద్ధితో ఆ సమస్యకు పరిష్కారం చెప్పాలి.

మానవులు ఈ కథల వ్యామోహంలో పడి అన్నీ మరచి పోతున్నారు. ఆఖరికి సమయానికి ఆలయాలలో పూజాదికాలు కూడా నిర్వర్తించటంలేదు.

వాళ్ళ కథా వ్యామోహం ఇలాగే కొంత కాలం కొనసాగితే జీవన చక్రం గతి తప్పిపోయేట్లు ఉంది తల్లి" అని ఎంతో విచారంగా చెప్పాడు.

"ఏం కథలు... అవి?"

నారదుడు పార్వతికి పరమశివుడు చెప్పిన కథలనే తిరిగి ఆమెకు చెప్పాడు.

ఆ కథలు విని పార్వతి ఆశ్చర్యపోయింది.



"తన నాథుడిని లోకంలో ఎవ్వరికి తెలియని కథలు చెప్పమని కోరింది. తన కోరికను మన్నించి పరమేశ్వరుడు చెప్పిన కథలు భూలోకంలో ప్రచారంలోకి ఎలా వచ్చాయి?

ఆమె ఆలోచిస్తూ ఉండగానే పరమేశ్వరడు వచ్చాడు.

శివునిరాక చూసి నారదుడు అక్కడ్నుంచి జారుకున్నాడు.

అతడు వచ్చిన పని అయిపోయింది.

కలహానికి తగ్గ సమస్యను సృష్టించేసాడు.

ఆది దంపతుల మధ్య ఒక అగ్గిని రాజేసిపోయాడు.

తాంబూలాలు ఇచ్చాడు. ఇక తన్నుకోవటమే తర్వాత...

పార్వతి శివునిపై అలిగింది.

ఆమె అలుకకు కారణం తెలుపమన్నాడు శివుడు.

నాథా... నేను కోరింది లోకంలో ఎవ్వరికి తెలియని కథలను నాకు చెప్పమని కానీ మీరు చెప్పిన కథలు భూలోకంలో ఇప్పటికే ప్రచారంలో ఉన్నాయి.

మీరు నా కోర్కెను మన్నించలేదు...

భూలోకవాసులందరికి తెలిసిన కథలను నాకు చెప్పటం అంటే మీరు నన్ను అవమానించడమే కదా అంటూ కారణం తెలిపింది.

పరమేశ్వరుడు ఖంగుతిన్నాడు.

పార్వతికి తను చెప్పిన కథలు దేవరహస్యం.

ఆ రహస్యం మానవులకు తెలియుట వలన మంచికంటే చెడు ఎక్కువ కలుగుతుంది...

వెంటనే...

దివ్యదృష్టి సారించాడు...

మొదటిగా ఆ కథలను విన్న సోమశర్మ పరమ శివుని దివ్యదృష్టి పథంలోకి వచ్చాడు.

శివునికి ఆగ్రహం వచ్చింది.

ఆలయంలో పూజాదికాలు నిర్వహిస్తున్న సోమశర్మ ముందు ప్రత్యక్షమయ్యి...

"పాపాత్ముడా... నా సతికి నేను చెప్పిన కథలను దొంగచాటుగా వినుటమేకాక ఆ కథలను లోకమంతా ప్రచారంలోకి రావటానికి కారణమవుతావా?

నేటినుండి నీవు ముప్పెవేల సంవత్సరాలు బేతాళుడవై రావిచెట్టుకు తల్లక్రిందులుగా వ్రేల్లాడుతూ ఉండు" అంటూ అతడ్ని శపించాడు.

సోమశర్మ భయం చెందాడు.

శివస్థుతితో పరమేశ్వరుడిని స్థుతించాడు.



"దేవా... తెలియక చేసిన తప్పు. నన్ను మన్నించు శాపవిమోచన మార్గం ఉపదేశించు'' అంటూ పరిపరి విధాల పరమేశ్వరుడిని ప్రాధేయపడ్డాడు.

అతడి ప్రార్థనలు ఆ పరమేశ్వరుడు మన్నించి శాంతించాడు. "భక్తా... నా శాపానికి తిరుగులేదు తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పుతప్పే అందుకు నీవు శిక్ష అనుభవించవలసిందే. నా వాక్కు వృధాకాదు. నీకు శాపవిమోచన మార్గం ఉపదేశిస్తాను విను...

ఒకనాటికి వీరుడు, ధీరుడు, సకల సుగుణములు కల విక్రమార్క మహారాజు ఒక క్షుద్రమాంత్రికునికి నిన్ను అప్పగించేందుకు తీసుకు పోవటానికి వస్తాడు.



విక్రమార్కుడు మౌనవ్రతం పాటిస్తాడు. అతడికి మౌనభంగం కల్గించగలిగితే తిరిగి నువ్వు చెట్టును చేరవచ్చును.

అలా ఇరవై మూడు సార్లు ఇరవై మూడు కథలను చెప్పు. అతడు సమాధానమిస్తాడు...

ఇరవై నాలుగవ కథకు సమాధానం లేదు. కనుక అతడు నిన్ను ఆ మాంత్రికుని దగ్గరకు చేరుస్తాడు.

ఆ సమయంలో అతడికి నీ చరిత్రను చెప్పి ఆ మాంత్రికుడి శిరస్సును ఖండించమని చెప్పు...

మాంత్రికుడిని బలి ఇవ్వటంతో నీవు విక్రమార్కుడి వశం అవుతావు. కొంత కాలం అతనికి సేవను చేస్తే నీకు శాపవిమోచనం కల్గుతుంది..." అంటూ శాపవిమోచనం అతనికి వివరించి...

"నేటినుండి ఈ కథలను సకల జనులు మర్చిపోదురుగాకా... తిరిగి విక్రమార్కుని విజయగాధతో ఈ కథలు జనబాహుళ్యంలోకి ప్రచారంలోకి వచ్చుగాకా" అని శపించి శివుడు అదృశ్యుడయ్యాడు.

ఆనాటి నుండి సోమశర్మ బేతాళుడై విక్రమాక్కుడి రాకకోసం నిరీక్షిస్తూ రావిచెట్టుకు శవంగా తల్లక్రిందులుగా వ్రేల్లాడసాగాడు.

## బేతాళుడు చెప్పిన కథలు

పూర్వం రత్నగిరి రాజ్యాన్ని విక్రమభూపాలుడనే మహారాజు పరిపాలిస్తున్నాడు.

అతడు ధర్మప్రభువు...

అతడి పాలనలో ధర్మం నాలుగు పాదాల నడిచింది.

రత్నగిరి ప్రజలు శాంతి స్వభావులు అందుచేత వారితో సంబంధ బాంధవ్యాలు కలుపుకోవటానికి ఇతర రాజ్యాల వారు ఎంతగానో తాపత్రయం కనబరిచేవారు.

రత్నగిరి రాచనగరులో ఉన్న బ్రాహ్మణ అగ్రహారంలో శివనాథశర్మ అనే కుటుంబం జీవిస్తుండేది.

అతడికి ఒక్కతే కుమార్తె.

పేరు భ్రమరాంబ.

ఆమె యుక్త వయస్కురాలైది.

ఒకనాడు శివనాథుని ఇంటికి మూడు రాజ్యాల నుండి ముగ్గురు యువకులు వచ్చారు.

ఆ ముగ్గురు అతని కుమార్తె అందచందాల గురించి ఆనోటా, ఆనోటా విని ఆమెను పెండ్లాడాలన్న కోరికతో వచ్చారు.

మొదటి యువకుడు తన కోరికను చెప్పి...

"అయ్యా! నేను పొరుగు రాజ్యం వాడిని మీ కుమార్తెను అపురూపంగా చూసుకొనగలను. లోకంలో ఎవరికో ఒకరికి మాత్రమే తెలిసిఉండే అపురూప విద్య నాకు తెలుసు" అన్నాడు.



"ఏమిటి...?" అంటూ ప్రశ్నించాడు శివనాథుడు.

అయ్యా! నేను కళ్ళు మూసుకుని నాకు కావలసినది ఎంత దూరాన ఉన్ననూ తెలుసుకొనగలను. అంటూ కళ్ళు మూసుకుని కొన్ని క్షణాల తర్వాత కళ్ళు తెరచి...



అయ్యా! మీ అమ్మాయి ఇప్పుడు పెరటిలో నూతి దగ్గర నీళ్ళను తోడుతున్నది. అంటూ చెప్పాడు.

శివనాథుడు వెళ్ళి చూడగా నిజంగానే అతని కుమార్తె పెరటిలో భావి దగ్గర నీళ్ళు తోడుతూ కన్పించింది.

తిరిగి వచ్చి సరే... నా కుమార్తె అభిప్రాయము కనుక్కుని చెప్తాను. నీవు ఈ రాత్రికి సత్రంలో బస చేసి ఉదయమురా" అంటూ అతడిని పంపేసాడు శివనాథుడు.

అతడు వెళ్ళి పోయాక రెండవ యువకుడు వచ్చాడు. అతడు కూడా తన కోరికను వివరించి తనకి కూడా ఒక అపురూప విద్యను తెలుసు అన్నాడు.

ఏమిటది అనడిగాడు శివనాథుడు.

"నేను క్షణాలలో వాయువేగంతో ప్రయాణించే శకటామను సృష్టించగలను" అంటూ ఆ యువకుడు అప్పటికప్పుడు ఒక రథాన్ని సృష్టించి చూపాడు.



శివనాథుడు మొదటి యువకుడికి చెప్పిన సమాధానమే రెండవ యువకుడికి చెప్పి పంపాడు.

కొంతసేపటికి మూడవ యువకుడొచ్చాడు.

అతడు కూడా శివనాథుడికి తన మనసులో మాట చెప్పి అయ్యా! నేను సకల క్షత్రియ విద్యల్లో అరితేరిన వాడిని అరవీరభయంకరులని పేరు పొందిన ఎంతో మంది వీరులను అవలీలగా జయించాను...

నాకున్న సాటిలేని యుద్ధ విద్యలకు ఎక్కడైనా రాచకొలువు దొరుకుతుంది. కనుక మీ పుత్రికను పువ్వుల్లో పెట్టి చూసుకొనగలను" అంటూ చెప్పాడు.

అతడిని కూడా మర్నాడు ఉదయం రమ్మని చెప్పి పంపేసాడు శివనాథుడు.

ఆ రాత్రి ఆ ముగ్గురు యువకుల గురించి కుమార్తెకు చెప్పి...

"అమ్మా! నీ కిష్టమైతే ఈ ముగ్గురు యువకులలో ఎవరో ఒకరిని ఎంచుకో" అని చెప్పాడు.

భ్రమరాంబ తన నిర్ణయం మర్నాడు ఉదయం చెబుతానని తండ్రికి చెప్పింది.

ఆమె ఆ రాత్రి ఆ ముగ్గురు యువకులలో ఎవరిని ఎంచుకోవలా అని తర్జన, భర్జన పడుతూ నిద్రకు దూరమైంది.

అర్ధరాత్రి సమయాన భ్రమరాంబ పెరటిలోకి వచ్చి భావిగట్టున కూర్చుని ఆలోచించ సాగింది.

అవి వెన్నెలరాత్రులు.

కృష్ణపక్షపు రోజులు...

ఆకాశంలో ఒక రాక్షసుడు తను వివాహం చేసుకోవటానికి తగిన కన్యను అన్వేషిస్తూపోతున్నాడు.

వాడి చూపు భ్రమరాంబపై పడింది.

ద్విగుణీకృతమైన అందంతో అపరంజి బొమ్మలా వెన్నెలలో తడుస్తున్న ఆమెను చూడగానే వాడి మనసులో... ఆహాఁ.. ఇటువంటి కన్య కోసమే కదా నా అన్వేషణ అనిపించింది.

హఠాత్తుగా భ్రమరాంబ ముందు ప్రత్యక్షమయ్యాడు.

ఆ రాక్షసుడిని చూడగానే భయంతో భ్రమరాంబ బొమ్మలా బిగుసుకు పోయింది.



క్షణాలలో ఆమెను ఎత్తుకుని ఆకాశ మార్గాన తన స్థావరానికి తీసుకు వెళ్ళిపోయాడు.

భయం నుంచి తేరుకున్న భ్రమరాంబ వేసిన కేకలకు మేలుకున్న శివనాథుడు అతని భార్య ఆకాశమార్గంలో రాక్షసుడు ఎత్తుకుపోతున్న కుమార్తెను చూసి స్పృహకోల్పోయారు.

మర్నాడు ఉదయం ముగ్గురు యువకులు వచ్చారు.

జరిగినదంతా తెలుసుకున్నారు.

దివ్య శక్తులను ఉపయోగించారు.

మొదటి యువకుడు రాక్షసుడి స్థావరం ఎక్కడ ఉన్నదో కళ్ళు మూసుకుని చూసి తెలుసుకుని చెప్పాడు.

రెండవ యువకుడు వాయు వేగంతో ప్రయాణించే రథాన్ని సృష్టించాడు.



మూడవవాడు ఆయుధములతో మిగిలిన ఇద్దరిని కలుపుకు పోయి వారిని రాక్షసుని స్థావరం బయట వదిలి తాను ఒంటరిగా పోయి రాక్షసుడిని సంహరించి భ్రమరాంబను రక్షించి తీసుకువచ్చాడు.

క్షేమంగా తిరిగి వచ్చిన భ్రమరాంబను పెండ్లాడే అర్హత తనకి ఉందంటే తనకి ఉందని ఆ ముగ్గురు యువకులు ఒకరితో ఒకరు తగవు పడి చివరకు న్యాయం కోసం రాజు దగ్గరకు వెళ్ళారు.

రాజా! విక్రమార్కా! విన్నావుగా ఈ కథ... ఆ ముగ్గురు యువకులలో భ్రమరాంబను రాజు ఎవరికి కట్టబెట్టాడన్నది ప్రక్కనపెట్టు నువ్వయితే ఆమెను ఎవరికి ఇచ్చి పెండ్లి చేస్తావో ధర్మబద్ధమైన తీర్పు చెప్పు.

"రాజా! గుర్తుందిగా శాపం... తెలిసి సమాధానం చెప్పక మౌనం వహిస్తే నీ తల వెయ్యి వ్రక్కలవుతుంది" అంటూ బేతాళుడు విక్రమార్కుడిని హెచ్చరించాడు.

"బేతాళా! రాక్షసుడితో పోరాడి ఆమెను క్షేమంగా తెచ్చిన యువకుడే ఆమెకు తగిన భర్త. ఆ యువకులలో మిగిలిన ఇద్దరికి ఉన్న శక్తుల వల్ల ప్రయోజనం ఉన్నా భర్తన్నవాడికి భార్యను కాపాడుకోగల శక్తి ఉండాలి. ఆ వీరత్వములేనప్పుడు ఎన్ని శక్తులున్నా వ్యర్థము.

నమ్ముకు వచ్చిన భార్యను కాపాడుకోలేని ఆ ఇద్దరి యువకులకు ఉన్న శక్తులు మూడవ యువకుడి వీరత్వము ముందు ఎందుకు కొరగావు. అందుచేత భ్రమరాంబకు తగిన భర్త ఆ యువకుడే."

విక్రమార్కుడు మౌనం వీడి బేతాళుడికి ఈ విధంగా సమాధానం చెప్పటంతో నియమం ప్రకారం మౌనభంగమై బేతాళుడు మాయమై తిరిగి చెట్టును చేరుకుని యథాస్థితిలో వ్రేళ్ళాడసాగాడు.

అప్పటికి ఒకసారి కాదు... రెండు సార్లు కాదు... ఇరవై మూడుసార్లు...

ప్రతిసారి విక్రమార్కుడు బేతాళుడిని భుజానికి ఎత్తుకుని ఆలయం వైపు నడక సాగించటం బేతాళుడు విక్రమార్కుడికి మౌనభంగం కల్గించటానికి ఒక కథను చెప్పి తర్వాత కథలో ఉన్న సమస్యను ప్రస్థావించి విక్రమార్కుడిని ధర్మబుద్ధితో పరిష్కరించమనటం...

ఆ సమస్యకు సమాధానం తెలిసిన విక్రమార్కుడు తెలిసి మౌనం వహిస్తే తల వెయ్యి వ్రక్కలవుతుందని బేతాళుడు ఇచ్చిన శాపానికి సంశయించి సమాధానమివ్వటం దానితో మౌనభంగమై బేతాళుడు విక్రమార్కుడి భుజం నుండి అదృశ్యుడై తిరిగి చెట్టును ఆశ్రయించుకుని యథాస్థితిన వ్రేళ్ళాడటం...



విక్రమార్కుడు నిరాశ చెందలేదు–
అలుపు, అలసటను లెక్కచేయలేదు–



సన్యాసికిచ్చిన మాట కోసం ఇరువైనాలుగవసారి చెట్టుపై నుండి బేతాళుడిని దించి భుజంపై వేసుకుని మౌనంగా ఆలయం వైపు నడవ సాగాడు.

"రాజా! అమితమైన నీ ధైర్యం, సహనం చూస్తుంటే నాకు బహు ముచ్చటగా ఉంది. ఆడిన మాట కోసం ఎంతశ్రమని లెక్కచెయ్యని నీవంటివాడు అరుదుగా ఉంటాడు.

ప్రయాణంలో అలుపు తెలియకుండా ఉండటానికి నీకో చక్కని కథను చెప్తాను విను" అంటూ విక్రమార్కుడికి మౌనభంగం కల్గించటానికి ఇరవైనాలుగవసారి కథను ప్రారంభించాడు.

## ఎవరికి ఎవరు ఏ వరుస...?

పూర్వం మహేంద్ర ప్రస్థం అనే రాజ్యాని సమరసింహుడు అనే రాజు పరిపాలిస్తుండేవాడు.

ఆ రాజ్యం సిరిసంపదలతో, సుఖశాంతులతో అలరాలుతుండేది.

ఒకనాడు ఆ రాజు దగ్గరకు ఒక పుర ప్రముఖుడు వచ్చి ఒక మూటను ఇస్తూ...

"రాజా! నేను నా భార్యా, కుమార్తెలతో కలసి కాశీయాత్రకు పోతున్నాను. కనుక తిరిగి వచ్చే వరకు ఈ మూటను భద్రంగా ఉంచుదారిలో ప్రమాదవశాత్తు నాకు ఏదన్నా ప్రమాదం కలిగితే నా బదులు నా భార్యా, కుమార్తెలలో ఎవరు నీ సమక్షానికి వచ్చినా ఈ మూటను అందచెయ్యి" అని కోరాడు.

సమరసింహుడు అందుకు అంగీకరించి ఆ మూటను తీసుకుంటూ..

"అయ్యా! క్షేమంగా వెళ్ళి లాభంగా రండి. నా వంతుగా వెయ్యినుట పదహార్లు ఇస్తాను. ఆ కాశీవిశ్వేశ్వరుడికి సమర్పించండి" అంటూ వెయ్యినుటపదహార్లు వరహాల మూటను అందించాడు.

ఆ వరహాల మూట తీసుకుని ఆ పురప్రముఖుడు తన కుటుంబంతో కలసి కాశీ ప్రయాణమైపోయాడు.

ఆ రాజ్య సరిహద్దులు దాటి అడవి మార్గాన ప్రయాణిస్తుండగా ఒక బందిపోటుల గుంపు వారికి ఎదురుపడింది.

భార్య కుమార్తెను వారి నుంచి తప్పించి ఆ పుర ప్రముఖుడు మాత్రం బందిపోటు దొంగల చేతిలో హతమైపోయాడు.

అడవిలో ప్రాణభయంతో ఆ ఇద్దరు ఆడవాళ్ళు తిరిగి తమ ఇంటికి చేరుకునే ప్రయత్నంలో దారి తప్పారు.

కొంత శ్రమపడి అడవి అవతల దిక్కునున్న ఒక శిథిలాలయం చేరుకున్నారు.

ఆ ఆలయ సమీపంలో ఒక నది ప్రవహిస్తోంది.



ఆ నదిలో మొఖం కాళ్ళు చేతులు శుభ్రపరుచుకుని కడుపు నిండా నీళ్ళు త్రాగి పోయి ఆ శిథిలాలయంలో వారిద్దరూ విశ్రాంతి తీసుకోసాగారు.

ఆ సమయంలో ఓ బ్రాహ్మణ జంట వచ్చింది.

వారిద్దరూ తండ్రీ కొడుకులు...

తండ్రికి కళత్రా వియోగం.

పుత్రుడు బ్రహ్మచారి.

నది ఒడ్డున ఇసుకలో ఉన్న పాదముద్రలు వారిని ఆకర్షించాయి.

ఆ పాదముద్రలు చూసి తండ్రికొడుకుతో...

"కుమారా! ఈ పాదముద్రలు స్త్రీలవి" అన్నాడు.



కొడుకు కూడా పరిశీలనగా చూస్తూ...

"అవునవును... ఒకటి కాస్తంత పెద్దవిగాను... ఒకటి కాస్తంత చిన్నవిగాను ఉన్నాయి" అన్నాడు.

తండ్రి తిరిగి ఆ పాదముద్రలను పరిశీలిస్తూ...

"ఈ ఇద్దరి స్త్రీలలో పెద్ద పాదముద్రలు ఉన్న స్త్రీ మధ్య వయస్కురాలు చిన్నపాద ముద్రలు ఉన్న స్త్రీ కన్యకామణి అయి ఉంటుంది" అంటూ వివరించాడు.

"అవును... నాకూ అలాగే తోస్తున్నది" ఆ కన్య ఎక్కడ ఉన్నదో కనిపిస్తే బాగుండు.

నన్ను వివాహమాడటం సమ్మతమేనేమో కనుక్కుని వివాహ మాడవచ్చు..." అన్నాడు.

తండ్రి కుమారుడితో...

నిరాశ చెందకు ఈ పాదముద్రలు ఇసుకలో పడి ఎంతో సేపు అయిఉండదు. కనుక ఆ స్త్రీలు ఈ చుట్టు ప్రక్కలే ఉండి ఉంటారు. నీవు కంగారు పడకు. చిన్నపాదముద్రలు ఉన్న స్త్రీ నీకు భార్యకావటం తథ్యం...

సకల శాస్త్రాలను ఔపోసన పట్టిన వాడినిగా నీకు వరమిస్తున్నాను. నీ కోర్కె తప్పక తీరుతుంది. అంటూ తండ్రి చేతిలో కొంత నీరు పోసుకుని మంత్రించి కొడుకు నెత్తిన చల్లుతూ తథాస్థు అని దీవించాడు.

కొడుకు తండ్రితో...

"తండ్రీ అమ్మ ఉంటే ఎంతో బావుండేది. ఆమెలేని లోటు మీకు ఎలాగు అనిపించినా నాకు మాత్రం ఎంతో వ్యథను కలుగచేసింది. కనుక మీరు పెద్ద అడుగులు ఉన్న స్త్రీని భార్యగా స్వీకరించుగాకా... నా మాట సత్యము.

ఇది ఎన్నటికి అసత్యముకాజాలదు గాకా" అంటూ అతడు చేతిలో కొంత నీరు పోసుకుని తథాస్థు అంటూ క్రిందజారవిడిచాడు.

తండ్రీ కొడుకులిద్దరూ ఒకరికొకరు వరాలు ఇచ్చుకుని పాదముద్రల ఆధారంగా శిథిలాలయంలో విశ్రాంతి తీసుకుంటున్న పురప్రముఖుని భార్య కుమార్తెను కనుగొన్నారు.

వారిద్దరికి తామిద్దరి గురించి చెప్పి... వారిని వివాహానికి ఒప్పించి తాము ఒకరితో ఒకరు అన్న మాటలు అసత్యములు కారాదు. కనుక చిన్నపాదాలు, ఎవరివో చూపమని కోరాడు తండ్రి.

ఆ ఇద్దరు ఆడవాళ్ళు తమపాదాలు చూపారు.

తండ్రీ, కొడుకులిద్దరూ ఆశ్చర్యపోయారు.

ఆ తల్లీ కూతుళ్ళలో..

పెద్ద పాదాలు కుమార్తెవి....

చిన్నపాదాలు తల్లివి.

ఆ తండ్రీకొడుకులు తేరుకుని అనుకున్న మాట ప్రకారం తల్లిని కొడుకు, కూతురిని తండ్రి వివాహం చేసుకుని తిరిగి ఇంద్రప్రస్థం చేరుకుని కాశీయాత్రకు బయలుదేరుతూ పురప్రముఖుడు రాజు దగ్గర దాచిన వజ్రాల మూటను ఆడవారిచేత తెప్పించి వాటిని అమ్ముకుని ఆధనంతో సుఖంగా గడపాగారు.

కొంత కాలానికి ఆ తండ్రీకొడుకులకు ఒక కుమార్తె, కుమారుడు కలిగారు.

రాజా! విన్నావుగా ఈ కథ...

ఇప్పుడు ఆ తండ్రీ, కొడుకులకు కలిగిన కుమార్తె, కుమారులు ఎవరికి ఎవరు ఏ వరుస అవుతారు?

గుర్తుందిగా నా శాపం తెలిసి సమాధానం చెప్పకపోతే నీ తల వెయ్యి వ్రక్కలు అవుతుంది. అంటూ బేతాళుడు విక్రమార్కుడిని హెచ్చరించాడు.

ఆ ప్రశ్నకు సమాధానం లేదు...

అందుకనే బేతాళుడు మౌనం వహించాడు.

బదులు పలుకకుండా నడక వేగం పెంచాడు.

బేతాళుడు సమాధానం కోసం పీడించసాగాడు.

విక్రమార్కుడికి ఆ ప్రశ్నకు నిజంగానే సమాధానం లేదు. కనుక బేతాళుడి శాపం ఫలించదనుకుని మౌన భంగం కలుగకుండా ఆలయం వైపు వేగంగా నడవసాగాడు.



విక్రమార్కుడికి తను అడిగిన ప్రశ్నకు సమాధానం తెలియదని గ్రహించిన బేతాళుడు విక్రమార్కుడికి అసలు నిజం చెప్పే సమయం ఆసన్నమయినదని గ్రహించాడు.



విక్రమార్కుడు ఏకదీక్షతో అడుగులు వేస్తున్నాడు.

రాజా! నేను చెప్పేది ఇప్పుడు కథకాదు.

లోకకళ్యాణం కోసం పరమ శివుడు నాకిచ్చిన ఆదేశం.

పరమేశ్వరుడు ఒకానొక మాస శివరాత్రి నాడు పార్వతికి కథలు చెప్పుట, వాటిని తను విని భార్యకు చెప్పుట ఆమె వాటిని ప్రచారం చేయుట అందుకు కోపించిన ఆ పరమేశ్వరుడు తనని శపించి ఆ తరువాత జాలిపడి శాపవిమోచన మును ప్రసాదించుట వంటి విషయలు చెప్పాడు.

ఆ తర్వాత...

రాజా! ఇప్పుడు నీవు కూడా లోకకళ్యాణం కోసం ఆ సన్యాసి తలపెట్టిన యజ్ఞానికి నన్ను బలి పశువుగా తీసుకుపోతున్నానని ఎంతో ఆనందిస్తున్నావు.

నిజానికి ఆ సన్యాసి నీకు చెప్పిందంతా బూటకం.

అతడు సన్యాసి కాదు. మాంత్రికుడు...

అతడు కోరుకున్నట్లుగా జరిగితే ఈలోకాన్ని వాడు పీడిస్తాడు.

అమోఘమైనటువంటి శక్తులు కల్గిన నేను వాడి వశము అవుతాను. అప్పుడు వాడు ఈ లోకంలో అందరికంటే శక్తిమంతుడు అవుతాడు.

మానవమాత్రులకు ఇక వాడిని సంహరించటం సాధ్యంకాదు.

వాడిని సంహరించడానికి తిరిగి ఆ పరమేశ్వరుడే ఈ భూమి మీద మానవ అవతారంలో జన్మించాలి...

నీవు ఆ మాంత్రికుడి బారిన పడకుండా నేను ఒక ఉపాయం చెప్తాను విను...

ఆ మాంత్రికుడు నన్ను వశం చేసుకోవాలంటే మహావీరుడైన నీవంటి క్షత్రియ రాజపుత్రుడిని బలిఇవ్వాలి లేదా వాడి వంటి మహామాంత్రికుడిని బలి ఇవ్వాలి కనుక వాడు నిన్ను బలి ఇవ్వాలని తలచాడు.

నీవు నన్ను తీసుకు వెళ్ళి వాడికి అప్పగించిన తర్వాత నీపని పూర్తవుతుంది.

అంతటితో వాడు నిన్ను వదలడు ముందుగా నిన్ను కొలనులో స్నానమాచరించమని చెబుతాడు.

నీవు స్నానమాచరించిన తరువాత దేవికి సాష్టాంగనమస్కారం చేసుకుని వెనకకు తిరిగి చూడకుండా వెళ్ళిపొమ్మని చెబుతాడు.

ఆ మాటలను నీవు నమ్మావా? నీ ప్రాణాలకు ముప్పు తెచ్చుకున్నట్లే... నీవు సాష్టాంగ నమస్కారం చేసిన మరుక్షణం ఒకవేటుతో నీ శిరస్సును ఖండించి బలితోవాడు చేస్తున్న క్షుద్రపూజను పూర్తిచేసుకుంటాడు.

ఆ తర్వాత నన్ను వశం చేసుకుంటాడు.

నేను వాడి వశమయ్యానా... ముందే చెప్పానుగా లోక వినాశానమే. నాశక్తిని వక్రమార్గంలో వినియోగించుకుని ఈ భూమండలాన్ని తన ఆధీనంలో ఉంచుకుంటాడు.

నీవు నేను చెప్పే ఉపాయం శ్రద్ధగా విను... అంటూ బేతాళుడు విక్రమార్కుడికి ఇంకా ఇలా చెప్పాడు.

“నీవు క్షత్రియుడివి... చక్రవర్తివి కనుక నిన్ను సాష్టాంగనమస్కారం చెయ్యమన్నప్పుడు నాకు అటువంటి నమస్కారము ఎలా చెయ్యాలో తెలియదు. ఒక్కసారి చేసి చూపించండి అంటూ వినయం నటించి అడుగు...

నీ మాటలు వాడు నమ్ముతాడు.

సాష్టాంగ నమస్కారం చేసి చూపుతాడు.

ఆ సమయంలో నీవు వాడి శిరస్సు ఖండించు... లోకకళ్యాణం జరుగుతుంది.



పరమ శివుడు నాకు చెప్పిన సకల లక్షణాలు కల్గిన రాజువు నువ్వే. కనుకనే నీకు ఈ రహస్యం చెప్పాను. ఇక లోకకళ్యాణం నీ చేతిలోనే ఉన్నది.” అంటూ బేతాళుడు విక్రమార్కుడికి చెప్పాడు.

విక్రమార్కుడు ఆ మాటలను శ్రద్ధగా వింటూ మౌనవ్రతం పాటిస్తూ బేతాళుడిని ఆలయంకు తీసుకు వచ్చి ఆ సన్యాసికి అప్పగించాడు.

ఆ సన్యాసి ఎంతో సంతోషిస్తూ...

రాజా! విక్రమార్కా! నాకు తెలుసు అనితర సాధ్యమైన ఈ కార్యాన్ని సాధించగల వీరుడవు, ధీరుడవు నీవేనని అందుకని ఎన్నడూ చెయ్యిచాచి పరులను సాయం కోరని నేను నిన్ను సాయం కోరాను. నా ప్రయత్నం వృథాకాలేదు.

ఈనాటి నుంచి ఈ భూమండలం యావత్తు నీ కీర్తికిరణాలు వ్యాపిస్తాయి.

ఈ ధరిత్రికి పట్టిన సకల పీడలు వదిలిపోతాయి. నీవు చిరంజీవిగా జనుల హృదయలలో నిలిచిపోతావు. నా మాటలు సత్యం.

ఇక్కడితో నీవు నాకు చేయవలసిన సాయం పూర్తయింది. కనుక నీవు ముందుగా కొలనులో స్నానమాచరించిరా... దేవిని దర్శించుకుని ఆమె దీవెనలు పొందుదువుగానివి” అంటూ విక్రమార్కుడికి చెప్పాడా సన్యాసి.

విక్రమార్కుడు మారుమాట్లాడకుండా పోయి ఆ సన్యాసి చెప్పినట్లే కొలనులో స్నానమాచరించి వచ్చాడు.

“రారాజా! రా... ఈ కుంకుమను ధరించి దేవికి సాష్టాంగ నమస్కారము చేసుకుని వెనకకు తిరిగి చూడకుండా నీవు తిరిగి వెళ్ళిపో... నీకు సకలము మంచి జరుగుతుంది.

ఈనాటి నుండి నీ పాలనలో ఈ ఉజ్జయినీ నగరం మహా సామ్రాజ్యముగా విరాజిల్లుటయేకాదు జనులందరి చేత భూతలస్వర్గంగా కీర్తింపబడుతుంది” అంటూ చెప్పాడు ఆ సన్యాసి.

విక్రమార్కుడికి బేతాళుడు చెప్పినట్లే సన్యాసి కూడా చెప్పటంలో బేతాళుడి మాటలే నిజమని నమ్మకం ఏర్పడిపోయింది.

సన్యాసితో బేతాళుడు చెప్పమన్నట్లే....

"మహాత్మా... నేను క్షత్రియ పుత్రుడిని ఇంత వరకు ఎవరికి సాష్టాంగ నమస్కారం చేసిందిలేదు.

కనుక తమరు ఒక్కసారి అది ఎలా ఉంటుందో చేసి చూపండి. అది చూసి నేను అలానే ఆచరిస్తాను" అన్నాడు.

సన్యాసి చిరునవ్వు నవ్వుకుంటూ దేవి విగ్రహం ముందు సాష్టాంగపడ్డాడు.

విక్రమార్కుడు క్షణం ఆలస్యం చెయ్యకుండా ఒరలో నుండి సర్రున కత్తిని బయటకు లాగి ఒక్కవేటుతో ఆ మాంత్రికుడి శిరస్సును ఖండించాడు.

రక్తతర్పణంతో దేవి ప్రతిమపాదాలను తడపగా ఆ దేవి ప్రత్యక్షమయ్యి విక్రమార్కుడిని ఆశ్వీరదించింది.

బేతాళుడు విక్రమార్కుడి వశం అయ్యాడు.

తెల్లవారు ఝాము వేళ అదృశ్య రూపంలో బేతాళుడు అనుసరిస్తుండగా విక్రమార్కుడు తిరిగి ఉజ్జయినికి చేరుకున్నాడు.

ఆరునెలల రాజ్యపాలన పూర్తిచేసుకున్నాడు విక్రమార్కుడు.

దేశాటనకు బయలుదేరాల్సి సమయం వచ్చింది.

ఆ రాత్రి భట్టి కుమారుడిని పిలిచి...

"సోదరా... నేను రేపు ఉదయం దేశాటనకు బయలు దేరుతున్నాను. కనుక రాజ్యపాలన భారమంతా నీదే" అంటూ రాజ్యభారం అప్పగించి తర్వాత కాస్సేపు మంతనాలు జరిపి మంది మార్బలానికి ఆ ఏర్పాట్లు చూడమని పురమాయించి విశ్రాంతి మందిరానికి వెళ్ళిపోయాడు.

మర్నాడు మంత్రులు, సైన్యాధిపతి... అంతఃపురసేవకులు దాసీ జనం... పురప్రముఖులు... పురప్రజలు అందరూ కలసి ఘనంగా జయ,జయ ధ్వానాలతో విక్రమార్కుడికి వీడ్కోలు పలికారు.

ఉత్తమాశ్వాన్ని అధిరోహించి అదృశ్యరూపంలో బేతాళుడు తోడురాగా రాజప్రాసాదం వదిలి వాయువేగంతో తూర్పు దిక్కుగా ప్రయాణమై సాగిపోయాడు విక్రమార్కుడు.



సాయింత్రం వరకు అలుపెరుగకుండా ప్రయాణించి ఉజ్జయిని సరిహద్దులు దాటి పర్వత ప్రాంతంలో ఉన్న ఓ గ్రామం చేరుకుని ఆ రాత్రి పూటకూళ్ళఇంటిలో బస చేసాడు.

మర్నాడు బయలుదేరి నిరాటంకంగా మూడు పగళ్ళు, మూడు రాత్రులు ప్రయాణించి విక్రమభూపాలుడు పరిపాలిస్తున్న కళింద రాజ్య సరిహద్దులలోకి ప్రవేశించాడు.

మూడు రోజుల ప్రయాణం చేత అశ్వం అలసిపోవటంతో దానికి తగినంత విశ్రాంతిని ఇవ్వటానికి సరిహద్దు గ్రామంలోని సత్రంలో బస చేసాడు.



రాత్రి బేతాళుడితో ముచ్చట్లాడుతూ...

"బేతాళా! మనం ఈ రాజ్యంలో ఒక వారంపాటు విశ్రాంతిని తీసుకుందాం. నీవు పోయి ఈ రాజ్యంలో విశేషాలను తెలుసుకురా" అంటూ ఆజ్ఞ జారీచేసాడు.

చిత్తం. ప్రభూ... అని కళింద రాజ్య విశేషాలను తెలుసుకు రావటానికి అప్పటికప్పుడు బయలుదేరి వెళ్ళాడు బేతాళుడు.

మర్నాటి ఉదయం...

విక్రమార్కుడు నిద్ర నుండి మేల్కొనేసరికి అతడి ముందు హాజరయ్యాడు బేతాళుడు.

“బేతాళా! విశేషాలు తెలుసుకువచ్చావా?”

బేతాళుడిని చూస్తూనే ప్రశ్నించాడు విక్రమార్కుడు.

“తెలుసుకున్నా ప్రభూ...”

వినయంగా చెప్పాడు.

“ఏమిటి... విశేషాలు...”

“చెప్పటానికి చాలా ఉన్నాయి. కానీ అన్నింటిలో ముఖ్యమైన విశేషం ఒకటున్నది.”

“ఏమిటది...?”

“చెప్తాను ప్రభూ! ముందు మీరు సిద్ధంకండి...”

“సరే...”

విక్రమార్కుడు దైనందిక కార్యక్రమాలు పూర్తి చేసుకుని కొంతసేపటి తర్వాత బేతాళుడి ముందు మఠం వేసుకుని కూర్చుని...

“బేతాళా! ఇప్పుడు చెప్పు. ఆ ముఖ్యమైన విశేషం” అంటూ కోరాడు.

“చెప్తాను ప్రభూ!ఈ విశేషంలో ఒక సాహసం ఉంది. ఆ సాహసంలో మిమ్మల్ని విజయం వరిస్తే కాంత... కనకం రెండూ దక్కుతాయి...”

“బావుంది శుభశకునం...”

విక్రమార్కుడు నవ్వుతూ బేతాళుడి వంకచూసాడు.

అవును ప్రభూ! శుభ శకునమే. అంతేకాదు ఇంత వరకు ఎంతో మంది ఆ సాహసం చేయటానికి పూనుకొని ఓడి ధనం పోగొట్టుకున్నారు.

“అంటే... జూదమా...”

“కాదు ప్రభూ... వాదము”

“బేతాళా! ఊరించకు. విషయము ఏమిటో త్వరగా చెప్పు”

“చెప్తాను వినండి ప్రభూ...”

## పద్మావతి కథ

కళింద రాజ్యంలో చంద్రావతి అనే వేశ్య ఉన్నది. ఆమె ఎంతో కాలం తన సరస సల్లాపాలతో విటులను ఆకర్షించి అమితమైన ధనం సంపాదించి విలాసవంతమైన జీవితం గడపసాగింది.



చంద్రావతి ఒక్కగానొక్క కుమార్తె పద్మావతి.

అందచందాలలోనూ, తెలివి తేటలలోనూ పద్మావతి చంద్రావతి కంటే ఏడాకులు ఎక్కువే చదివింది.

తల్లి జీవితం చూసిన పద్మావతి తను వేశ్యావృత్తిని స్వీకరించకూడదని నిర్ణయించుకుంది.

ఆమె తల్లి చంద్రావతి ధనాశపరురాలు కుమార్తెను వేశ్యా వృత్తి స్వీకరించి ధనం సంపాదించమని కోరింది.

తల్లి మాట కాదనలేక...

తన నిర్ణయం మార్చుకోలేక...

మధ్య మార్గంగా పద్మావతి ఒక ఉపాయం ఆలోచించింది. తన దగ్గరకు వచ్చే విటుడు ఎవరైనా సరే తనని మాట్లాడించగలగాలి అప్పుడు వారి సొంతం అవుతుంది. తనని మాట్లాడించలేకపోతే వేయి వరహాలు జరిమానాగా చెల్లించి పోవాలి.

పద్మావతి షరతు విన్న ఎంతో మంది మగవారు దానికి ఒప్పుకుని పోయి పద్మావతిని మాట్లాడించలేక వేయి వరహాల జరిమానా చెల్లించి అవమానంతో తప్పుకోసాగారు.

ఒకరోజు, రెండురోజులు కాదు గత మూడు సంవత్సరాలుగా పద్మావతి ఒక్క పురుషుడూ తనని తాకకుండా జాగ్రత్తపడుతూ ధనం సంపాదించసాగింది.

విక్రమార్కుడికి బేతాళుడు ఈ కథను చెప్పి...

“రాజా! ఈ కళింద రాజ్యంలో ఉన్న విశేషాలన్నింటిలోనికి అతి విచిత్రమైన విశేషం ఇదే...” అన్నాడు.

“భేష్... బేతాళా ముందుగా మన బుద్ధి బలంతో చేయతగ్గ సాహసాన్ని తెలుసుకొచ్చావు... వెంటనే బయలుదేరుదాం” అంటూ ఉత్సాహం ప్రదర్శించాడు విక్రమార్కుడు.

“తొందర పడకండి ప్రభూ...! ముందు అక్కడకు పోయి నేను పూర్తి పరిస్థితులు తెలుసుకు వస్తాను. అప్పటి వరకు మీరు ఇక్కడనే విశ్రాంతి తీసుకోండి...”

విక్రమార్కుడి అనుమతి తీసుకుని బేతాళుడు తిరిగి పద్మావతి ఇంటి వైపుకు అదృశ్యుడయ్యాడు.

రెండొవనాడు పద్మావతి ఇంటి నుండి తిరిగి వచ్చిన బేతాళుడు అదృశ్యరూపంలో ఉండి తను తెలుసుకున్న విషయాలన్ని విక్రమార్కుడికి తెలియ చెప్పి అక్కడ ఎలా మనసులు కోవాలో వివరించాడు.

విక్రమార్కుడు అక్షరం పొల్లుపోకుండా బేతాళుడు చెప్పిన విషయాలన్ని బుర్రకు పట్టించుకుని పద్మావతి ఇంటికి బయలుదేరాడు.

పద్మావతి ఇంటికి చేరుకున్న విక్రమార్కుడు ఆమె ఇంటి గోడ మీద రాసి ఉన్న షరుతుల పట్టికను చదివి నవ్వుకున్నాడు.

బేతాళుడు చెప్పినట్లే పద్మావతిని మాట్లాడించగలవారికి ఆమె దక్కుతుంది.

అలా చేయలేని పక్షంలో వెయ్యి వరహాలు జరిమానా విధించ బడుతుంది.

ఆ పందెమునకు కాలనిర్ణీతం ఒక రాత్రి మాత్రమే. అలాగే జరిమానా మొత్తాన్ని ముందుగా చెల్లించాలి.

విక్రమార్కుడు నవ్వుకుని వెళ్ళి జరిమానా వెయ్యి వరహాలను ముందుగా చెల్లించి పందెంకు తను ఆ రాత్రికే సిద్ధమని పద్మావతి తల్లికి తెలియచేసి సత్రంకి పోయి విశ్రాంతిని తీసుకున్నాడు.

ఆ రాత్రి బేతాళుడి సాయంతో ఎన్నో అడ్డంకులను దాటుకుని చివరికి పద్మావతి శయన మందిరం చేరుకున్నాడు.

పద్మావతి మహా తెలివైనది.

విక్రమార్కుడు తనని చేరుకోవటానికి ఉన్న అడ్డంకులన్నీ దాటుకుని శయన మందిరంకి చేరుకోగానే ఆమె ఒక ఎత్తు వేసింది. విక్రమార్కుడు స్వయంగా తనని చూడలేదు. కనుక అతను మందిరంలో ఎవరు ఉన్నా గుర్తించలేదు.

పద్మావతి తన ఎత్తు ప్రకారం తన దాసిని అందంగా అలంకరించి శయన మందిరంలోకి పంపింది.

బేతాళుడు విక్రమార్కుడితో...



"రాజా! వచ్చింది పద్మావతి కాదు. ఆమె దాసి..." అంటూ రహస్యంగా చెప్పాడు.

ఆ దాసి మౌనంగా మంచం చూపించి ఒక చీటిని అందించింది. ఆ చీటిపై "మంచం తలగడ వైపు కూర్చోండి" అని రాసి ఉంది.

విక్రమార్కుడు మంచం వైపు చూసాడు.

ఆ మంచానికి తలగడ ఎటో... కాళ్ళవైపు ఎటో తెలియట్లేదు.

బేతాళుడు విక్రమార్కుడి సంశయం అర్థం చేసుకుని...

"రాజా! కంగారు పడకు. అక్కడ ఉన్న పండ్లలో ఒక పండును తీసుకుని మంచం ఒక వైపు నుండి మరోక వైపుకు దొర్లించు.

అవి వాలుగా ఎటు వైపుపోతుందో అది కాళ్ళ వైపు" అంటూ సలహా ఇచ్చాడు.

విక్రమార్కుడు ఆ సలహా పాటించి తలగడ వైపు కూర్చున్నాడు.

ఆ తర్వాత ఆ దాసీ వంక చిరునవ్వుతో చూస్తూ...

"కూర్చున్నది తలగడవైపునే కదా... ఇక నీవు పోయి మీ అమ్మగారిని రమ్మని చెప్పు" అన్నాడు.

ఆ దాసీ ఖంగుతిన్నది.

వెంటనే వడి, వడిగా పోయి పద్మావతికి జరిగిన విషయాన్ని వివరించి...

"అమ్మా! వచ్చినవాడు సామాన్యుడుకాడు. ఘటికుడు. ఇంత ఆడంబరంగా అలంకరించుకున్న నన్ను ఒక్క చూపుతోనే దాసినిగా పసికట్టాడు. ఇక మీరు వెళ్ళక తప్పదు" అంటూ చెప్పింది.

పద్మావతికి విక్రమార్కుడిని పట్ల ఉత్సాహం కలిగింది. ఇంత వరకు తను కల్పించిన విచిత్రమైన పరీక్షలను దాటుకుని శయన మందిరానికి వచ్చిన వారు బహు కొద్దిమంది. వారంతా కూడా తన దాసీ చేతిలోనే ఓడిపోయారు.

ఇక ఇప్పుడు ఈ యువకుడు ఎవరోగానీ అన్ని విచిత్ర పరీక్షలను దాటుకుని వచ్చి దాసీ బండారం కూడా బయట పెట్టాడు. ఇక అతను ముందుకు పోయి మౌనవ్రతంతో గెలవటం తప్ప మరోక మార్గంలేదు.

అనుకుని అందంగా అలంకరించుకుని విక్రమార్కుడి గదిలోకి వచ్చి నిశ్శబ్దంగా కూర్చుంది.

విక్రమార్కుడికి పద్మావతి సౌందర్యం ఆకర్షించింది.

"ఆహాఁ.. ఏమి ఈ సౌందర్యం. ఇటువంటి కన్యను చేపట్టటం మగతనానికి, వీరత్వానికి, గౌరవం కదా" అనుకుని ఆమెను మాట్లాడించటానికి ప్రయత్నించాడు.



పద్మావతి ఉలుకు, పలుకు లేకుండా ఉండిపోయింది.

విక్రమార్కుడు శత విధాల ప్రయత్నించాడు.

పద్మావతి మౌనవ్రతం వదలలేదు.

విక్రమార్కుడిని నిరాశ ఆవహించింది.

"బేతాళా... పద్మావతిని మాట్లాడించటానికి తగిన ఉపాయం ఏదన్నా ఉంటే చెప్పు..."

నిరాశ నుండి కొంచెం తేరుకుని స్వశక్తితో సాధించలేని కార్యము... పద్మావతి సౌందర్యం ఆకర్షించటంతో బేతాళుడి సాయం కోరాడు.



"రాజా! నీకొక చక్కని ఉపాయం చెబుతాను విను. పద్మావతిని మాట్లాడించాలంటే ఆమెను కాదు ముందుగా ఇక్కడ ఉన్న వస్తువులను మాట్లాడించు... వాటన్నిటిని ఒక కథను చెప్పమని అడుగు. అవి కథలు చెబుతాయి" అంటూ సలహా ఇచ్చాడు.

విక్రమార్కుడు అక్కడ ఉన్న వస్తువులను చూసాడు. ఎదురుగా ఉన్న దీపపు సమ్మెకన్పించింది.

విక్రమార్కుడు చిరునవ్వు నవ్వి...



"ఓ దీపపు సమ్మె... ఈ పద్మావతి దేవి ఘోరమైన మౌనవ్రతాన్ని పాటిస్తున్నది. అవతల చూస్తే కాలాతీతమైపోతున్నది. ఈమె నాకు దక్కుతుందన్న ఆశ నాకు పోయింది.

ఈ రాత్రి నిరాశగా గడిపేస్తే చేదు జ్ఞాపకంగా ఉంటుంది. కనుక ఇంతటి సౌందర్యవతి చెంత నుండి కాలక్షేపం లేక భారంగా గడుస్తున్న రాత్రిని నీవొక మంచి కథను చెప్పి నాకు ఈ పద్మావతిదేవికి కాలక్షేపం కలిగించు" అన్నాడు.

పద్మావతి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

ప్రాణం లేని దీపం కథను చెప్పటమా?

ఈ యువకుడు మంత్రగాడా? మాయల మరాఠీనా...?

దీపాన్ని కథ చెప్పమంటున్నాడు. నిరాశలో మతి భ్రమించి పైత్యపు మాటలు పలుకుతున్నాడా? అనుకుని విక్రమార్కుడి వంక చూసింది.

విక్రమార్కుడు తిరిగి చిరునవ్వుతో...

"దీపమా...! నా మాట విను... నువ్వు నా మాటకు ఉలుకు, పలుకు లేకుండా కూర్చుంటే ఈ పద్మావతిదేవి నన్ను మతిభ్రమించినవాడు అనుకుంటుంది. కాలక్షేపం కోసం ఓ చక్కని కథను చెప్పు..." అన్నాడు.

బేతాళుడు ఆ దీపాన్ని ఆవహించాడు...

దీపంలో నుండి బేతాళుడు కథను చెప్పటం ప్రారంభించాడు.

పద్మావతి ఆశ్చర్యచకితురాలయ్యింది.

దీపం కథను పూర్తి చేసింది.

పద్మావతి దేవిలో మార్పు కలిగింది.

ఈ యువకుడు అడగగానే ఈ దీపం కథను చెప్పిందే...

ఇతడు దీపంతో ఎలా మాట్లాడించగలిగాడు.

"అమ్మో...! దాసి చెప్పినట్లు ఇతడు సామాన్యుడు కాదు. ఇందులో ఏదో మర్మం ఉంది. ఇంకా ఇతడు ఏం చిత్రాలు చేస్తాడో... తేల్చు కోవలసిందే" అనుకుని కొంత ఆసక్తి కనపరిచిందే కానీ మౌనం మాత్రం వదిలి మాట మాట్లాడలేదు.

విక్రమార్కుడు కొంతసేపు ఎదురు చూసి పద్మావతిదేవి పలుకక పోవటంతో శయ్యకు వేల్లాడుతున్న పరదా వంక చూస్తూ...

"ఈ గదిలో చీకటిని పోగొడుతున్న దీపం చక్కని కథను చెప్పిందే కానీ... చీకటిని పోగొట్టినట్లు ఈ పద్మావతి దేవి మౌనాన్ని పోగొట్టలేక పోయింది.

తెరా నువ్వన్నా పద్మావతి మౌనాన్ని పోగొట్టే ఓ చక్కని కథను చెప్పు" అంటూ తెరను అడిగాడు.

దీపంలో ఉన్న బేతాళుడు తెరలోకి వచ్చాడు.

తెరను ఆవహించిన బేతాళుడు కథను ప్రారంభించాడు.

తెర చెప్పిన కథను పద్మావతిదేవి ఎంతో ఆసక్తిగా విన్నది.

కథను పూర్తి చేసిన బేతాళుడు.

రాజా! విన్నావుగా ఈ కథ ఈ కథలో భర్త కళ్ళు కప్పి చాటుమాటు సరసాలు ఆడిన ఆ నెరజాణ చివరికి పదిమంది ఎదుటన తను పతివ్రత అని నిరూపించుకుంది కదా...

ఈ పద్మావతిదేవి ఆ నెరజాణను మించిన జాణ. ఉగ్గుపాలతోనే సకల కళలను రంగరించి పోసింది ఈమె తల్లి. ఆ కళలనే ఇప్పుడీమె ప్రదర్శిస్తోంది.

తెరలో ఉండి బేతాళుడు అన్న ఆ మాటలు పద్మావతి మనసుకు ములుకుల్లా గుచ్చుకున్నాయి.



అప్పటి వరకు పాటించిన మౌనవ్రతం మర్చిపోయింది.

"అబద్ధం... నేను నీచానికి దిగజారిన ఆడదాన్ని కాను. ఈనాటికి ముమ్మాటికి నా పాతివ్రత్యానికి భంగం కల్గలేదు" అంటూ ఆవేశంగా అరిచింది.

విక్రమార్కుడు చిరునవ్వునవ్వాడు.

"పద్మావతి నీవు మౌనంవీడావు. మాటలాడావు. షరతు ప్రకారము ఇక నీవు నన్ను వరించవలసిందే నీ అందము నా సొంతం కావలసిందే..." అంటూ ఆమెను ఆటపట్టించాడు.

పద్మావతి సిగ్గులమొగ్గలయ్యింది.

మాట ప్రకారం విక్రమార్కుడిని వరించింది.

## విక్రమార్కుడు చిలుక రూపం పొందుట

విక్రమార్కుడు పద్మావతిదేవిని చేపట్టి తిరిగి ఉజ్జయిని నగరానికి ప్రయాణమయ్యాడు.

ఆ వార్త వేగుల ద్వారా భట్టి కుమారుడు తెలుసుకున్నాడు.

విక్రమార్కుడిని స్వాగతసత్కారాలతో ఉజ్జయినికి ఆహ్వానించటానికి ఎదురు బయలుదేరాడు.

ఒక అరణ్య ప్రాంతంలో ఒకరికొకరు ఎదురుపడ్డారు.

మధ్యాహ్న సమయం...

కొంత విశ్రాంతి తర్వాత అక్కడ నుండి బయలు దేరుదామని నిర్ణయం జరిగింది.

విక్రమార్కుడికి ఒక కంసాలి మిత్రుడున్నాడు.

అతడి పేరు ఫణేంద్రుడు.

అతిలోక సౌందర్యరాశి అయిన పద్మావతిదేవిని చూడగానే అతడి మనసు చలించింది.

అంతటి సౌందర్యం అతడిలో దురాశరేపింది.

విక్రమార్కుడి అదృష్టం ఈర్ష్య పుట్టించింది.

పద్మావతి అది గమనించింది.

ఎవరు...? ఏమిటో తెలియకుండా భర్త దగ్గర అతడి మిత్రుడిని గూర్చి చెడుగా మాట్లాడటం సభ్యతకాదు కనుక మౌనం వహించింది.

ఆ సమయంలో...

వారు బసచేసిన ప్రాంతంలో ఒక విచిత్రం జరిగింది.

చుట్టూ చెట్ల మధ్యన గుడారాలు వేసారు.

ఆ చెట్ల గుంపులో ఒక చెట్టుపైకి చిలుకల గుంపు చేరింది.

ఆ గుంపులో ఉన్న ఓ చిలుకల జంట ఉన్నట్లుండి ఒకదానితో ఒకటి తగవుకు దిగాయి.



రెండింటి మధ్య హోరాహోరి యుద్ధం మొదలైంది.

ఆ దృశ్యం విక్రమార్కుడి కంటపడింది.

ఫణేంద్రుడిని పిలిచి...

"మిత్రమా.... చూసావా? ఆ చిలుకలు రెండూ ఎలా పోరాడు కుంటున్నాయో" అన్నాడు.



"అవును... మగ చిలుక గెలుస్తుందో ఆడ చిలుక గెలుస్తుందో చూద్దాం..." అన్నాడతను.

రెండు చిలుకలు ఒకదానితో ఒకటి ప్రాణాలకు తెగించి మరీ పోరాడుతున్నాయి.

ఆడ చిలుక మగ చిలుకను చంపేసింది.

ప్రాణం విడిచిన మగ చిలుక చెట్టుపై నుండి జారి క్రిందపడి పోయింది.

విక్రమార్కుడిని ఆదృశ్యం కలచివేసింది.

ప్రక్కనున్న ఫణీంద్రుడు...

"మిత్రమా... ఆ ఆడ చిలుక ఎంతకు తెగించింది. మగ చిలుక ప్రాణాలను నిలువునా తీసింది కదా... అటువంటి దాన్ని క్షమించరాదు. నువ్వు అనుమతివ్వు ఒక్క బాణంతో దాని ప్రాణాలను గాలిలో కలిపేస్తాను" అన్నాడు.

విక్రమార్కుడు అతడ్ని వారిస్తూ...

"వద్దు.. ఫణీంద్రా... అది తన శక్తితో పోరాడింది.

మనమూ అవసరమైతే చిలుకగా మారి దాన్ని అంతం చేద్దాం..." అన్నాడు.

"అంటే నువ్వు ఆ మగ చిలుకలోకి పరకాయ ప్రవేశం చేస్తావా?" అంటూ ఆశ్చర్యం నటించాడు ఫణీంద్రుడు.

విక్రమార్కుడికి పరకాయ ప్రవేశ విద్య తెలుసు. ఆ సంగతి ఫణీంద్రుడికి తెలుసు.

కానీ....

ఫణీంద్రుడికి పరకాయ ప్రవేశ విద్య తెలుసు. ఆ విషయం విక్రమార్కుడికి తెలియదు.

"అవును..."

సరే... వెంటనే ఆ పని చెయ్యి లేకపోతే ఆ ఆడ చిలుక ఎటన్న ఎగిరిపోవచ్చు. అంటూ విక్రమార్కుడిని ప్రోత్సహించాడు ఫణీంద్రుడు.

విక్రమార్కుడు పరకాయ ప్రవేశం చేస్తూ...

ఫణీంద్రా... నేను చిలుక రూపం ఎత్తి ఆ ఆడ చిలుక మదం అణచివచ్చేంత వరకు నా శరీరాన్ని భద్రంగా చూడు అని చెప్పి తన శరీరాన్ని వదిలి మగ చిలుకను ఆవహించి ఆడ చిలుకపైకి యుద్ధానికి వెళ్ళాడు.

అదే అదునుగా భావించిన ఫణీంద్రుడు పరకాయ ప్రవేశ మంత్రం పఠించి తన శరీరం వదిలి విక్రమార్కుడి శరీరాన్ని ఆవహించి తన శరీరం చాటుకు ఈడ్చుకుపోయి ముక్కలు, ముక్కలుగా చేసి కాకులకు, గ్రద్దలకు ఆ ముక్కలను ఆహారంగా వేసేసాడు.

ఆడ చిలుకతో యుద్ధంలో మునిగి ఉన్న విక్రమార్కుడు ఫణీంద్రుడి మోసం గమనించలేదు...

విక్రమార్కుడు ఆడ చిలుకను ఓడించి పరకాయ ప్రవేశమంత్రం పఠించటానికి సమాయత్తమయ్యే సరికి విక్రమార్కుడి రూపంలో ఉన్న ఫణీంద్రుడు తన మందిమార్బలంతో కూడి ఆ ప్రదేశాన్ని వదిలి ఉజ్జయిని వైపు వెళ్ళిపోయాడు.

## విక్రమార్కుడు చిలుకల గుంపులో చేరుట

జరిగిన మోసాన్ని గ్రహించిన విక్రమార్కుడు ఎంతగానో విచారించాడు.

మిత్రద్రోహానికి తెగించిన ఫణీంద్రుడి బండారాన్ని ఎలా బయట పెట్టాలా అని ఎంతగానో ఆలోచించాడు.

అనాలోచితంగా చేసేకార్యాల వలన ఎలాంటి ముప్పుకలుగుతుందో ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చేసరికి తల్లడిల్లిపోయాడు.

అదే సమయంలో...

ఆ చిలుకల గుంపుకు నాయకత్వం వహిస్తున్న చిలుక...

"మిత్రులారా! పొద్దుపోయింది. ఇంక మనం ఇక్కడుండటం అంత క్షేమంకాదు. రాత్రి వేళ ఈ చెట్టు మీదకు సర్పాలు చేరుతాయి. అందుకని మన గూళ్ళకు త్వరగా పోదాం... పదండి"



అని చిలకల నాయకుడు హెచ్చరించటంతో మిగిలిన చిలుకలన్ని బయలుదేటానికి సిద్ధం అయ్యాయి.

విక్రమార్కుడు ఇక అప్పటికి చెయ్యగలిగిందేం లేదని ప్రస్తుతానికి ఆ చిలుకల గుంపుతో కలసి ఉండటమే క్షేమమని నిర్ణయించుకుని వాటితో కలసి ప్రయాణమయ్యాడు.



ఆ విధంగా విక్రమార్కుడు ఆ చిలుకల గుంపులో ఒక చిలుక అయ్యాడు.

కొంతకాలం గడిచింది–

ఒకనాడు...

ఆహారం కోసం చిలుకలన్ని ఆశపడి బోయవాడు పన్నిన వలలో చిక్కుకుని తల్లడిల్లాయి.

విక్రమార్కుడు వాటిని ఓదారుస్తూ...

మిత్రులారా... భయపడకండి ఐకమత్యమే మహాబలం ఆపదలు ఎదురైనప్పుడు బుద్ధిబలంతో వాటిని ఎదుర్కొనాలి.

కంగారు పడకండి నేచెప్పేది శ్రద్ధగా వినండి.

మనమందరం కలసి నూరు మంది ఉన్నాము. బోయవాడు వచ్చేసరికి అందరం చచ్చినట్లు నటిద్దాం... మనం చనిపోయామనుకుని వల నుండి ఒక్కొక్కరిని తీసి క్రిందకు విసిరేస్తాడు.

ఆ సమయంలో కాస్తంత శ్రద్ధగా క్రిందకు పడుతున్నచప్పుడును అందరూ శ్రద్ధగా లెక్కకట్టండి.

నూరవసారి చప్పుడు వినిపంచగానే అందరం ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరిపోదాం అంటూ సలహా చెప్పాడు.

చిలుకలన్ని ఆ సలహాను మెచ్చుకున్నాయి.

ఆ బోయవాడు వచ్చినప్పుడు అలానే నటించాయి.

విక్రమార్కుడు చెప్పినట్లుగానే ఆ బోయవాడు ఆ చిలుకలన్ని చనిపోయినాయి అనుకుని ఒక్కొక్క చిలుకను వల నుండి తప్పించి క్రిందపడవెయ్యసాగాడు.

సరిగ్గా తొంభై తొమ్మిది చిలుకలను వల నుండి తప్పించి క్రిందకు విసిరేసాడు.

ఆఖరి చిలుక విక్రమార్కుడు.

అతడిని వల నుండి తప్పించే ప్రయత్నంలో బోయవాడు ఉండగా అతడి మొలకున్న కొడవలి జారి క్రిందపడింది.

ఆ చప్పుడు విన్న చిలుకలన్ని నూరువసారి చప్పుడు వినిపించిందని గ్రహించి ఆకాశంలోకి రివ్వున ఎగిరిపోయాయి.

చిలుకలు చేసిన మోసానికి ఆ బోయవాడు ఒక్కసారిగా నిర్ఘాంత పోయి వలలో ఉన్న ఆఖరి చిలుకను తప్పించకుండా ఒడిసిపట్టుకుని...



"ఆహాఁ... మీరెంత మోస కారులు... నన్నే మోసం చేస్తారా?" అంటూ దాని పీక నులిమి చంపబోయాడు.

చిలుక రూపంలో ఉన్న విక్రమార్కుడు మానవ భాషలో...

"మూర్ఖుడా... ఎగిరిపోయిన చిలుకలన్ని సాధారణ చిలుకలు. నేను మాట్లాడే చిలుకను.

నన్ను చంపితే నీకే నష్టం... నన్ను పట్టుకుపోయి వీలైనంత ఎక్కువ ధనానికి ఎవరికన్న అమ్ము" అని చిలుక రూపంలో ఉన్న విక్రమార్కుడు ఆ బోయవాడ్ని గద్దిస్తూ తన ప్రాణాలను కాపాడు కునే ఉపాయంపన్నాడు. చిలుక మాట్లాడటంతో ఆ బోయవాడు మరొక సారి నిర్ఘాంత పోయాడు.

కొద్ది క్షణాలలో...

బోయవాడు తేరుకుని అది సాధారణ చిలుక కాదని గ్రహించి దానిని చంపటంమాని ఎగిరిపో కుండా ఒడిసి పట్టుకుని జాగ్రత్తగా పంజరంలో బంధించాడు.



ఆ బోయవాడు చిలుకను పట్టుకు పోయి ఎక్కువ ధరకు ఒక వర్తకుడికి అమ్మి ఆ ధనం తీసుకుని చిలక రూపంలో ఉన్న విక్రమార్కుడికి కృతజ్ఞతలు చెప్పుకుని సంతోషంగా వెళ్ళిపోయాడు.

ఆ విధంగా విక్రమార్కుడు బోయవాడి చేతిలో చావుతప్పించుకుని వర్తకుడి ఇంటిలో పంజరంలో చిలుకగా మారాడు.

ఆ వర్తకుడు చిలుకను తన భార్య అయిన ప్రభావతి దేవికి బహుమానంగా ఇచ్చాడు.

మానవ భాషలో మాట్లాడుతున్న చిలుకను చూసి ప్రభావతిదేవి ఎంతగానో సంతోషించి దానిని ముద్దుచేసి తియ్యని జామపండ్లను పంజరంలో పెట్టి పంజరం తీసుకుపోయి తన శయన మందిరంలో వ్రేల్లాడదీసుకుంది.

కొద్ది రోజుల్లోనే చిలుక రూపంలో ఉన్న విక్రమార్కుడు ప్రభావతిదేవికి ఆరోప్రాణం మారాడు.

నిత్యం ప్రభావతికి రక,రకాల కథలు చెప్పేవాడు.

ప్రభావతిదేవి ఎంతో సేపు చిలుక దగ్గరే కూర్చుని అది చెప్పే కబుర్లు వింటూ కాలక్షేపం చేసేది.

ఒకనాడు ఆ వర్తకుడు దూరప్రాంతాలకు పోయి వర్తకం చేసి రావాలని నిర్ణయించుకుని అందుకు తగ్గసన్నాహాలు త్వరత్వరగా పూర్తి చేసుకుని బయలుదేరుతూ చిలుకతో...

"ఓ మాటకారి చిలుక నేను దూరప్రాంతాలకు వర్తకానికి పోతున్నాను. నేను తిరిగి వచ్చేంత వరకు నా భార్యను నీకు అప్పగిస్తున్నాను. ఆమె మంచి చెడ్డలు చూడవలసిన బాధ్యత నీదే"

అంటూ చిలుకరూపంలో ఉన్న విక్రమార్కుడికి అప్పగించి మరీ బయలుదేరి వెళ్ళాడు.

కొన్ని రోజులకు...

ఆ రాజ్యాన్ని ఏలే మహారాజు శచీభూపాలుడు అంబారిపై నగర సంచారానికి వచ్చాడు.

ఆ సమయంలో...

ప్రభావతీదేవి తరాలస్నానం చేసి మిద్దెపై నిలబడి కురులను ఆరబెట్టుకుంటున్నది.

ఆ రాజు ఆమెను చూసాడు.

ఆమె అందానికి ముగ్ధుడైపోతూ...





"ఆహాఁ... ఇటువంటి సౌందర్యము ఇన్నాళ్ళ నుండి నా కంట పడలేదు కదా.. ఏమైనా ఈమెను పొందవలసిందే'' అనుకుని ప్రభావతిదేవిపై తను మనసు పడ్డ విషయం ఆంతరంగికుడికి చెప్పి అతడినే ప్రభావతిదేవి దగ్గరకు రాయబారమునకు పంపాడు."

రాజు వర్తమానం అందుకున్న ప్రభావతిదేవి సర్వాంగసుందరంగా అలంకరించుకుని రాజు దగ్గరకు వెళ్ళే ప్రయత్నమును చేయగా..

చిలుక రూపంలో ఉన్న విక్రమార్కుడు వర్తకుడు వెడుతూ ప్రభావతిదేవి మంచి చెడ్డలు తనని చూడమని అప్పగించిన విషయమును గుర్తుకు తెచ్చుకుని...

"ప్రభావతిదేవి ఎక్కడకు బయలుదేరావ్?" అనడిగాడు.

"ఓసి... రాలుగాయి చిలుక నీవు వినలేదా రాజు పంపిన వర్తమానము" అందామె ముసి, ముసిగా నవ్వుతూ...

"అవునవును విన్నాను. కానీ తప్పు చెయ్యాలనుకున్నప్పుడు తప్పించుకునే నేర్పుఉండాలి..."



"అంటే..."

"అంటే ఏముంది... తప్పులు అందరూ చేస్తారు. కానీ దొరకకుండా కొందరే చెయ్యగలరు. దానికి బుద్ధిబలం కావాలి. అటువంటి కథను నీకు ఒకటి చెప్తాను విను" అంటూ చిలుక ఒక కథను ప్రారంభించింది.

కథ పూర్తి అయ్యేసరికి తెల్లవారుఝాము అయ్యింది.

ఇప్పుడు చెప్పు ప్రభావతి ఈ కథలో స్త్రీలా నువ్వు తప్పుచేసి తప్పించుకోగలవా? అని అడిగింది.

అమ్మో... నా వల్లకాదు. అంటూ ప్రభావతి గుండెలపైన చెయ్యి వేసుకుని నిట్టూర్చింది.

మర్నాడూ ఇదేతంతు–

ప్రభావతిదేవి సర్వాంగ సుందరంగా అలంకరించుకుని బయలుదేరే సమయానికి చిలుక రూపంలో ఉన్న విక్రమార్కుడు మరోక కథను చెప్పాడు.

ఆనాటికి తన ప్రయత్నం విరమించుకుందామె.





ఆనాడే కాదు అలా డెబ్భైరెండు రాత్రులు డెభై రెండు కథలను చెప్పి విక్రమార్కుడు ప్రభావతిదేవి మనసును మార్చి వర్తకుడు తనకి ఆమెను ఎలా అప్పగించాడో వర్తకం నుండి తిరిగి వచ్చిన వర్తకుడికి అలానే ఆమెను అప్పగించాడు.

చిలుక రూపంలో ఉండి విక్రమార్కుడు ప్రభావతిదేవికి చెప్పిన కథలను గాథాశుకశప్తి కథలు అంటారు.

అవి డెభ్బైరెండు కథలు. కనుక ఈ కథనంలో డెభ్బైరెండురాత్రులు విక్రమార్కుడు చిలుక రూపంలో ప్రభావతికి కథలు చెప్పాడని నిర్ధారించి వ్రాయటం జరిగింది.

విక్రమార్క చరిత్రను సంక్షిప్తంగా పరిచయం చేసే ఉద్దేశంతో ఈ పుస్తకం వ్రాయటం జరిగింది. కనుక స్థలాభావం వల్ల ఆ కథను వ్రాయలేదు.

ఆ రోజు ఇక ప్రభావతి తన ప్రయత్నం మానుకుంది.

## విక్రమార్కుడికి తిరిగి స్వేచ్ఛ లభించటం

వర్తకుడు ఉంటున్న నగరానికున్న కొత్వాలుకి భద్రావతి అనే వేశ్యయే సర్వస్వం...

ఆమె పేరుకుతగ్గట్టుగానే భద్రకాళి.

నిత్యం ప్రజలనుండి అక్రమంగా కొంత ధనం వసూలు చేసేది. అందుకు ఆమె ఎవరినో ఒకరిని చూపించి రాత్రి ఇతడు నా కలలోకి వచ్చి అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు తక్షణం తీర్చమని చెప్పు అంటూ కొత్వాలుకి చెప్పేది.

అతడికి భయపడి ప్రజలు భద్రావతి చెప్పిన మొత్తాన్ని ఆమెకు చెల్లించుకునేవారు.

వర్తకుడు దూరప్రాంతానికి పోయి వర్తకంలో బాగా లాభాలు గడించుకు వచ్చాడని ఆ నోటా, ఆనోటా భద్రావతి చెవులకు చేరింది.

ఏమైనా వర్తకుడి నుండి కొంత ధనం గుంజాలను కొని ఒకనాడు వర్తకుడు రాత్రి తన కలలోకి వచ్చి వెయ్యి వరహాలు అప్పుతీసుకున్నాడు. పోయి ఆ ధనం తీసుకురండి అంటూ సేవకులను పంపింది.

ఆ సేవకులు వచ్చి భద్రావతి చెప్పిన విషయం చెప్పి వెయ్యి వరహాలు ఇమ్మని అడిగారు.

వర్తకుడి గుండెల్లో రాయి పడింది.

పంజరంలో చిలుక రూపంలో ఉన్న విక్రమార్కుడు అది గమనించి ఆ సేవకులతో...



"అయ్యా... మీరు చెప్పింది నిజమే కావచ్చు. కానీ ఆ ధనం మీకు ఇవ్వటం కుదరదు. మా యజమాని మీ అమ్మగారి దగ్గర కలలో పుచ్చుకున్న వెయ్యి వరహాలను ముద్దరశుద్ధిగా ఇవ్వటానికి సిద్ధంగానే ఉన్నారు. కానీ ఇచ్చింది మీ అమ్మగారు, పుచ్చుకుంది మా అయ్యగారు. కనుక మీ అమ్మగారిని స్వయంగా వచ్చి ఆ ధనం పుచ్చుకుని పొమ్మనండి" అంటూ వారికి చెప్పాడు.

"అలాగే" నంటూ ఆ సేవకులు వెళ్ళిపోయారు.

ఆ తర్వాత...

విక్రమార్కుడు ఆ వర్తకుడితో...

"అయ్యా! మీరు దిగులు పడకండి. నేను చెప్పినట్లు చెయ్యండి. వెయ్యి వరహాలు ఒక మూటగా కట్టి పైన వేల్లాడి దియ్యండి. క్రింద ఒక అద్దము ఉంచండి.

భద్రావతి రాగానే సాదరంగా ఆహ్వానించి అద్దములో ఉన్న వరహాల మూట ప్రతిబింబం చూపించి తీసుకోమని చెప్పండి.

మిగతా విషయలు నేను మాట్లాడతాను" అంటూ ఆ వర్తకుడికి ధైర్యం చెప్పాడు.

సేవకులు తిరిగి వెళ్ళి భద్రావతికి వర్తకుడి దగ్గర ఉన్న చిలుక చెప్పిన విషయం చెప్పారు.

"సరే... పదండి..." అని సేవకులను వెంటపెట్టుకుని ఆమె స్వయంగా వచ్చి ధనం ఇమ్మని అడిగింది.

విక్రమార్కుడు చెప్పినట్లే క్రిందనున్న అద్దలో కనిపిస్తున్న వరహాల మూట ప్రతిబింబాన్ని చూపించి తీసుకోమని చెప్పాడు వర్తకుడు.

"అద్దంలో ఉన్న ధనం ఎలా తీసుకుంటారు. నీకే మన్నా మతి చెడిందా...?" అంటూ వర్తకుడ్ని గద్దించింది.

పంజరంలో చిలుకలా ఉన్న విక్రమార్కుడు పెద్దగా నవ్వుతూ భద్రవతితో...

"నిజమే... కానీ కలలో నువ్వు ఇచ్చిన అప్పును ఇలా తీర్చటమే న్యాయం" అన్నాడు.

ఆ మాటలకు భద్రావతి మండిపడింది...

ఒక చిలుక తనని అవమానించటమా...?

జనాలూ....

సేవకులూ...

వర్తకుడు...

అందరివంక ఒకసారి తేరిపారా చూసింది భద్రావతి.

అందరూ తనవంక ఎగతాళిగా చూస్తున్నట్లు అనిపించింది. అంత అవమానము అంతకు ముందు ఆమె ఎప్పుడూ ఎరిగి ఉండాదు. అందుకనే ఆ చిలుకకు తగిన గుణపాఠం చెప్పలి అనుకుంది.




వర్తకుడిని బెదిరించి చిలుకను సొంతం చేసుకుని దాన్ని తీసుకుపోయి తన వంట వాడికి అప్పగించి కూరను వండి వడ్డించమంది.

ఆ వంటవాడు చిలుకను బయటకు తీసి పీక నులిమి కొన ఊపిరితో ఉన్న దానిని ప్రక్కను ఉంచి వంట ప్రయత్నాలకు పొయ్యి రాజేసేందుకు ప్రయత్నాలలో ఉండగా...

కొన ఊపిరిలో ఉన్న విక్రమార్కుడు నానా తంటాలు పడి అక్కడ నుండి బయటపడి చివరకు ఎలాగోలా ఉజ్జయిని నగరాన్ని చేరాడు.



# విక్రమార్కుడు తిరిగి తన శరీరంలో ప్రవేశించుట

ఉజ్జయినీ చేరుకున్న విక్రమార్కుడు భట్టి కుమారుడి దగ్గరకు పోయి జరిగిందంతా వివరించాడు.

భట్టి ఎంతో విచారిస్తూ...

“సోదరా... ఆ ఫణీంద్రుడు నీ రూపంలో ఉన్నా... అతడు నీవు కాదని నేను వదిన సంశయిస్తూనే ఉన్నాము. అందుకను ఆమె నిత్యం ఏదో ఒక వ్రతం ఆచరిస్తున్నట్లు నటిస్తూ తన ఏకాంత మందిరానికే పరిమితమైపోయి ఉన్నది...

నేను ఇంతకాలంగా నీ జాడకోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను. కాలం అనుకూలించలేదు. ఇప్పుడికి నీ శరీరం నీకు దక్కేందుకు మంచి ఉపాయం ఆలోచిస్తాను. ప్రస్తుతానికి నిన్ను నీ రాణి మందిరానికి చేరుస్తాను. జరిగింది ఆమెకు వివరించు. కొంత కుదుటపడుతుంది. జరగవలసిన దానిని నేను చూస్తాను”

విక్రమార్కుడిని ఓదార్చి ఎవ్వరి కంట పడకుండా చిలుకను తీసుకుపోయి పద్మావతిదేవి మందిరంలో విడుస్తూ ఆ చిలుకే విక్రమార్కుడు అని చెప్పి వచ్చేసాడు భట్టి కుమారుడు.




చిలుక రూపంలో ఉన్న విక్రమార్కుడి నోటి వెంటే జరిగిన సంగతులన్ని తెలుసుకుంది పద్మావతిదేవి.

కొద్దిరోజుల తర్వాత ఒకనాడు.

రాజ అంతఃపురంలో ఉన్న మైదానంలో పొట్టేళ్ళ పోటీని నిర్వహించాడు భట్టి కుమారుడు.

రెండు పొటేళ్ళ మధ్య యుద్ధం మొదలైంది.

విక్రమార్కుడి రూపంలో ఉన్న ఫణీంద్రుడు కూడా ఆ పోటీని ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నాడు.

కొంతసేపటికి ఒక పొట్టేలు ఓడిపోయి క్రిందపడిపోయి ప్రాణాలు విడిచింది.



భట్టి కుమారుడు విక్రమార్కుడి రూపంలో ఉన్న ఫణీంద్రుడి దగ్గరకు చేరి...

"చూసావా సోదరా... ఆ ఆడ పొట్టేలు గర్వం... ఏది ఏమైనా దాని గర్వం అణచాల్సిందే నీవు అనుమతి ఇవ్వు ఒక్కవేటుతో నా కత్తికి దాని తలను బలి ఇచ్చి దాని గర్వమణు స్తాను" అంటూ ఎంతో ఆవేశం నటించాడు.

"వద్దు సోదరా! దాని గర్వం నేను అణుస్తాను" అన్నాడు ఫణీంద్రుడు.

"అంటే పరకాయం చేస్తావా?"

"అవును... నేను తిరిగి వచ్చే వరకు నా శరీరం భద్రంగా చూడు" అని భట్టికి చెప్పి పరకాయ మంత్రం పఠించి చనిపోయిన పొట్టేలులోకి ప్రవేశించి రెండవ పొటేలుతో యుద్ధానికి తలపడ్డాడు.

భట్టి కుమారుడు అదే అదునుగా భావించి చిలుక రూపంలో ఉన్న విక్రమార్కుడి దగ్గరకు వెళ్ళి...

"సోదరా... ముల్లును ముల్లుతోనే తీసాను. ఇక నీవు ఈ చిలుక శరీరం వదిలి నీ శరీరంలోకి ప్రవేశించు" అంటూ చెప్పాడు.

విక్రమార్కుడు వెంటనే పరకాయ మంత్రం పఠించి తన దేహంలోకి చేరుకుని ఆలస్యం చెయ్యకుండా... తిరిగి లేచిన పొట్టేలు తలన నరకమని ఆజ్ఞాపించాడు.



ఫణీంద్రుడు విక్రమార్కుడి ఆజ్ఞవిని జరిగింది గ్రహించి తేరుకునే లోపే పొట్టేలు తల తెగి నేలరాలింది.

విక్రమార్కుడు భట్టి ఉపాయం వల్ల తిరిగి తన దేహంలోకి తాను ప్రవేశించినందుకు పద్మావతి దేవి ఎంతగానో సంతోషించింది.

ఆ తర్వాత.....

విక్రమార్కుడు యథావిధిగా ఆరు నెలలు రాజ్యపాలన ఆరు నెలలు దేశాటన చేస్తూ ఉజ్జయిని నగరాన్ని జనరంజకంగా పరిపాలించసాగాడు.

## శాలివాహనుడు విక్రమార్కుడిని జయించుట

ఉజ్జయినీని విక్రమార్కుడు పరిపాలించటం మొదలయ్యి అప్పటికి దాదాపుగా రెండువే సంవత్సరాలయ్యింది.

అటువంటి సమయంలో...

ఉజ్జయినికి దూరంగా...

ఒకనదీ తీర గ్రామంలో...

కుమ్మరి కులానికి చెందిన కుటుంబం జీవిస్తున్నది. ఆ కుటుంబీకునికి ఒక్కత్తె కుమార్తె...

ఒకనాటి రాత్రివేళ...

కుంభ వృష్టిగా వానకురుస్తున్నది.

వానకి తోడు గాలి...

ఆ రెండు తోడై నదీమ తల్లి అల్లకల్లోలంగా ఉంది.

అటువంటి సమయంలో...

ఆ నది ఒడ్డున ఒక పెద్ద మనిషి వర్షంలో తడుస్తూ ఆ కుమ్మరి వానికి కన్పించాడు.

అంత వానలో నది ఒడ్డున ఉన్న ఆయనను చూసి ఆశ్చర్యపోతూ "అయ్యా తమరెవరు? ఇంత వర్షంలో ఇక్కడ కూర్చున్నారు" అంటూ ప్రశ్నించాడు..."

అందుకు ఆయన ఎంతో విచారంగా....

"అయ్యా... నేను ఈ నదికి అవతల ఉన్న గ్రామస్థుడిని జోతిష్య శాస్త్రంలో అపారమైన అనుభవం ఉన్న పండితుడిని ఈ రాత్రికి ఒక దివ్యమైన సుముహుర్తం ఉన్నది.

ఆ సుముహుర్తకాలంలో భార్యతో కూడి గర్భాదానం చేస్తే చక్రవర్తి కాగల కుమారుడు పుడతాడు. ఇటువంటి సుముహుర్తం ఎన్నో వందల ఏళ్ళకు ఒక్కసారి వస్తుంది.

ఈ నదీ ప్రవాహం చూస్తే ప్రాణాలతో అవతలకు పోయేట్లులేదు. అందుకని విచారిస్తున్నాను" అంటూ చెప్పాడు.

కుమ్మరివాడు ఆలోచనలో పడ్డాడు–

"అయ్యా... తమరు చెప్పేది నిజమేనా?" అంటూ అడిగాడు.

"నిజమే..."

"అయితే తమరు ఈ రాత్రికి నా ఇంటికిరండి. నాకొక కుమార్తె ఉన్నది. ఆమెను మీ భార్యగా స్వీకరించి గర్భాదానం చెయ్యండి" అంటూ కోరాడతను.

ఆ పండితుడు అందుకు అంగీకరించలేదు.

ఎంతగానో పండితుడిని ప్రాధేయపడి...

"అయ్యా... ఎన్నో ఏళ్ళకు ఒక్కసారి వచ్చే అటువంటి సుముహుర్త కాలాన్ని వృథాగా పోనివ్వట మెందుకు నా మాట విని మీరు నా కుమార్తెను భార్యగా స్వీకరించండి."

అని చెప్పి ఒప్పించి తన ఇంటికి తీసుకుపోయి ఆ పండితునికి తన కుమార్తెకు గాంధర్వ పద్ధతిన వివాహం జరిపించాడు.

ఆ పండితుడు ఆ రాత్రి అతని కుమార్తెకు గర్భాదానం చేసి మర్నాడు తన దారితాను వెళ్ళిపోయాడు.

నవమాసాల తర్వాత ఒక శుభముహుర్తాన కుమ్మరి వాని పుత్రిక ఒక పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది.

ఆ శిశువుకు జాతక కర్మలను నిర్వహించి శాలివాహనుడని నామకరణం చేసారు.



శాలివాహనుడు దిన, దిన ప్రవర్ధమానుడై... కృష్ణపక్షమునాటి చంద్రునివలే పెరుగసాగాడు.

చిన్నప్పటి నుంచి శాలివాహనుడు మట్టితో సైనికుల బొమ్మలను, గుర్రాలు, ఏనుగులు, రథాలు వంటి చతురంగ బలాలను తయారు చేసి వాటికి తాను రాజుగా చేసుకుని ఆటలాడటం చూసిన అతడి తల్లి,తాత ఆనాడు జ్యోతిష్యశాస్త్ర పండితుడు చెప్పిన మాటలు అసత్యము కావని భావించారు.

కాల చక్రం తిరుగుతోంది.

శాలివాహనుడు యవ్వనంలోకి అడుగుపెట్టాడు.

ముఖంలో గాంభీర్యం...

దేహంలో కఠినత్వం...

చూపులకు మన్మధరూపం...

నడత...

మాటా...

ఆలోచనల్లో నిరంతరం అతడు చక్రవర్తికాతగ్గవాడన్న భావన చూపరులకు కల్గించేవాడు.

ఒకానొకనాడు...

చిన్నప్పట్నుంచి శాలవాహనుడు మట్టితో చేసిన చతురంగా బలాలకు జీవం వచ్చేసింది.

శాలివాహనుడికి ఒక మహాసైన్యం సమకూరింది.



అంతమహాసైన్యం ఆ చుట్టు ప్రక్కల రాజ్యాలలో ఏ రాజుకూ లేదు....

సైన్యం సమకూరిన క్షణం నుండి సైన్యాధిపతి... మందిమార్బలం... సైన్యం... అందరూ "జయహో... శాలి వాహన చక్రవర్తి జయహో" అంటూ శాలివాహనుడిని కీర్తించసాగారు.

సైన్యం ఉంది... రాజ్యమే లేదు....